నిప్పుల కొలిమి

25కి పైగా మండలాల్లో 40డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత



బోసిపోయిన చిత్తూరు గాంధీసర్కిల్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 7: సూర్యుడు నిప్పులు కురిపిస్తున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. 25 మండలాల్లో 40డిగ్రీలకు పైగానే నమోదయ్యాయి. ప్రస్తుతం నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతల ఆధారంగా జిల్లా ఆరెంజ్ జోన్‌లో ఉంది. ఇలాగే పెరుగుతూ పోతే రెడ్‌జోన్‌లో వెళ్లే ప్రమాదం ఉంది. ఆదివారం అత్యధికంగా తవణంపల్లెలో 44.5, అత్యల్పంగా రామకుప్పంలో 37.6 డిగ్రీలు నమోదైంది. మండలాల వారీగా.. నింద్రలో 43.8, విజయపురంలో 43.5, శ్రీరంగరాజపురంలో 43.4, నగరిలో 42.8, పులిచెర్లలో 42.6, సోమలలో 42.4, పాలసముద్రం, గుడిపాలలో 42.0, బంగారుపాళ్యం, యాదమరి, పుంగనూరులో 41.6, సదుంలో 41.4, పెద్దపంజాణిలో 41.3, కార్వేటినగరంలో 41.2, చౌడేపల్లె, రొంపిచెర్లలో 41.1, గంగాధరనెల్లూరులో 41.0, చిత్తూరులో 40.8, వెదురుకుప్పంలో 40.6, గంగవరం, శాంతిపురంలో 40.5, కుప్పంలో 40.2, పలమనేరు, పెనుమూరులో 40.1, పూతలపట్టులో 39.5, గుడుపల్లెలో 39.4, వి.కోటలో 39.2, బైరెడ్డిపల్లెలో 39.0, ఐరాలలో 38.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

చలివేంద్రాలెక్కడ?

టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసవిలో గ్రామ పంచాయతీ నిధులతో ఊరూరా చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో మాత్రం చలివేంద్రాల జాడే కానరావడం లేదు.



అభినయ్, అశ్విన్ మృతదేహాలు

ఈత సరదాకు అన్నదమ్ముల దుర్మరణం

సదుం, ఏప్రిల్ 7: ఈత సరదాకు అన్నదమ్ములు తమ ప్రాణాలు పోగొట్టుకున్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం నుంచి సదుం మండలంలోని చెరుకువారిపల్లెకు శరవణ, భాను దంపతులు వలస వచ్చారు. వీరు కొంతకాలంగా సదుం కాలేజీ రోడ్డులో చిరువ్యాపారంతో జీవనం సాగిస్తున్నారు. వీరి కుమారులు అభినయ్(14), అశ్విన్(13) స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 8, 9వ తరగతి చదువుకుంటున్నారు. ఆదివారం సెలవు కావడంతో మధ్యాహ్నం భోజనం చేశాక ఆడుకుని వస్తామని ఇంటి నుంచి వెళ్లిన అన్నదమ్ములు సరదాగా ఈత కొట్టడానికి నడిగడ్డ మార్గంలోని రఘుపతి నాయుడు చెరువులోకి దిగారు. కొంతసేపటికి లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతానికి వెళ్లడంతో మునిగిపోయారు. సమీపంలోని వ్యక్తులు వీరిని గమనించి చెరువు నుంచి బయటకు తీసి, స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే పిల్లలిద్దరూ మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు ఆస్పత్రిలో విగతజీవులైన బిడ్డల్ని చూసి.. కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, సదుం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్ విగ్రహానికి కోడ్ వర్తించదా..?



పూతలపట్టు, ఏప్రిల్ 7: పూతలపట్టు మండలంలోని దిగువ పాలకూరులో ఉన్న వైఎస్ విగ్రహానికి ఎన్నికల కోడ్ వర్తించదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. పూతలపట్టు - కాణిపాకం వెళ్లే రోడ్డు పక్కన దిగువ పాలకూరు గ్రామం ఉంది. బస్సులు, ఇతర వాహనాలు వెళ్లే ఈ రోడ్డు పక్కనే వైఎస్ విగ్రహం ఉంది. దీనికి వేసిన ముసుగును స్థానికులు కొందరు తొలగించారు. దీంతో ఆదివారం ఇటుగా వెళ్లే వాహనదారులు, కాణిపాకం వెళ్లే భక్తులు కూడా ఈ విగ్రహానికి కోడ్ వర్తించదా? అని చర్చించుకున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమవారం) : సా. 6.30
సహరి (మంగళవారం) : ఉ. 4.44

2023-24లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా లక్ష్యం, ఆదాయం (రూ.కోట్లలో)

ఎస్ఆర్ కార్యాలయం	లక్ష్యం	సాధించింది	శాతం	జరిగిన రిజిస్ట్రేషన్లు
బంగారుపాళ్యం	8.85	5.67	64.07	5877
కుప్పం	21.83	10.31	47.23	14,039
పలమనేరు	30.14	16.09	53.40	15,578
పుంగనూరు	28.32	14.24	50.28	12,836
చిత్తూరు ఆర్వో	58.93	29.53	50.11	15,898
కార్వేటినగరం	7.09	3.82	53.92	7285
నగరి	13.48	5.92	43.95	7038
చిత్తూరు రూరల్	13.09	6.91	52.80	8071
మొత్తం	181.78	92.52	50.90	86,622

వేసవి కాలం ప్రారంభమైంది. ఎండలు మండుతున్నాయి. భూగర్భ జలాలూ చాలావరకు అడుగంటాయి. చాలా ప్రాంతాల్లో ఇప్పటికే తాగునీటి సమస్య ప్రారంభమైంది. సమస్యను పరిష్కరించాలంటూ అధికారులకు ప్రజలు వినతిపత్రాలు సమర్పించి, నిరసనలు తెలుపుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వారానికి ఒక్కసారి కూడా నీటి ట్యాంకరు రావడం లేదని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

\- చిత్తూరు సిటీ



బంగారుపాళ్యం మండలం టేకుమంద గ్రామంలో నీటి ట్యాంకుకోసం వేచిచూస్తున్న గ్రామస్తులు

గొంతెండుతోంది!

223 గ్రామాల్లో తాగునీటి సమస్య

- పరిష్కారానికి రూ.8.55 కోట్ల అంచనా

జిల్లాలోని 5,362 గ్రామాల్లో 16.20 లక్షల జనాభా ఉంది. వీరికి 8,329 చేతి బోర్లు, 6,734 బోరు బావుల ద్వారా నీరందిస్తున్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో తాగునీటి సమస్య రావచ్చని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అంచనావేసి, నీటి ఎద్దడి నివారణకు ప్రణాళిక సిద్ధం చేశారు. 23 మండలాల్లోని 223 గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.8.55 కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనల్లో.. 55 బోర్లలో ఫ్లషింగ్, 126 బోర్లు డీపెనింగ్, 44 బోర్లు అద్దెకు తీసుకోవడానికి, ఇవికాక అవసరమైన చోట్ల కొత్త బోర్లు వేయడానికి, చేతిపంపులు, బోరు మోటార్ల మరమ్మతులు, ఇవన్నీ వీలుకాని ప్రాంతాల్లో ట్యాంకర్లద్వారా నీటి సరఫరా తదితరాలున్నాయి.



బంగారుపాళ్యం ఎంపీడీవో శివశంకర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఇందిరమ్మ కాలనీ వాసులు (ఫైల్‌ఫొటో)

మండలాలవారీగా సమస్య తలెత్తే గ్రామాలు

పులిచెర్లలో 43, సదుంలో 37, రొంపిచెర్లలో 31, గంగాధరనెల్లూరులో 20, చౌడేపల్లెలో 18, యాదమరి, పూతలపట్టులో 11, పలమనేరులో 10, పుంగనూరులో ఏడు, పెద్దపంజాణిలో ఐదు, ఐరాల, తవణంపల్లెలో నాలుగు చొప్పున, గుడిపల్లె, కుప్పం, శాంతిపురం, బంగారుపాళ్యంలో మూడు చొప్పున, గుడిపాల, సోమల, పాలసముద్రంలో రెండు చొప్పున, చిత్తూరు, కార్వేటినగరం, వెదురుకుప్పం, వి.కోటలో ఒకటి చొప్పున ఉన్నాయని అధికారులు అంచనా వేశారు.

కాంట్రాక్టర్లు ముందుకు రాకుంటే..?

గతంలో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా ఆలస్యం చేసింది. బిల్లుల కోసం సీఎం జగన్‌కు, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కాంట్రాక్టర్లు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించారు. వి.కోట మండలంలో అయితే ఏకంగా పెద్దిరెడ్డి కాన్వాయ్‌ను అడ్డుకుని నిరసన తెలపడంతో ఆలస్యంగా బిల్లుల చెల్లింపులు జరిగాయి. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది నీటి సరఫరాకు కాంట్రాక్టర్లు ముందుకురాకపోతే పరిస్థితి ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది.

వన్యప్రాణులకూ తాగునీటి కష్టం

పలమనేరు, ఏప్రిల్ 7: పలమనేరు సమీపంలోని కౌండిన్య అటవీ ప్రాంతంలో వన్యప్రాణులు తాగునీటి కోసం అలమటిస్తున్నాయి. గత ఏడాది అదనులో వర్షాలు అంతంత మాత్రంగానే కురిశాయి. దీంతో అడవుల్లోని చిన్నచిన్న కుంటలు, చెరువుల్లో నీరు పూర్తిగా ఎండిపోయింది. వేసవి ఎండలు మండుతుండటంతో అడవిలోని వన్యప్రాణులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఆదివారం మండలంలోని కాలువపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో ఎండిపోయిన చెరువు మధ్యలో ఉన్న చిన్న నీటి గుంత వద్దకు ఓ ఏనుగు వచ్చింది. కేవలం అడుగు లోతు కూడా లేని గుంతలోని నీటిని తాగి వెళ్లిపోయింది. ఈ సమస్య పరిష్కారానికి అటవీ ప్రాంతంలోని చెరువుల వద్ద బోర్లు వేయడానికి ప్రభుత్వానికి అటవీ శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. ఈ నిధులు విడుదలయ్యేలోపు వన్యప్రాణులు తాగునీటి కొరతతో చనిపోయే ప్రమాదం ఉందని అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలు అంటున్నారు. అదీగాక తాగునీటి కోసం సరిహద్దు గ్రామాలపై వన్యప్రాణులు పడితే పరిస్థితేంటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే యుద్ధ ప్రాతిపదికన బోర్లు వేసి.. వన్యప్రాణులకు తాగునీటి కష్టం తప్పించాలని కోరుతున్నారు.



చెరువులోని చిన్న నీటి గుంత వద్దకొచ్చిన ఏనుగు



వైసీపీ కండువాలు కప్పుకొన్న వారిలో పాత వైసీపీ కార్యకర్తలు

వైసీపీ కార్యకర్తలకే కండువాలు కప్పి..!

మళ్లీ పార్టీలో చేరారని మంత్రి చెప్పారంటూ టీడీపీ విమర్శ

పుంగనూరు, ఏప్రిల్7: వైసీపీ కార్యకర్తలకే కండువాలు కప్పారు.. వీరంతా తమ పార్టీలో చేరారంటూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెబుతున్నారంటూ చౌడేపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి విమర్శించారు. కండువా కప్పుకొన్న వారిలో వారం ముందు వైసీపీ ప్రచారంలో పాల్గొన్న వారూ ఉన్నారన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఆ ఫొటోలను మీడియాకు విడుదలచేసి మాట్లాడారు. చౌడేపల్లె మండలం బత్తలాపురానికి చెందిన వెంకటరమణ, రెడ్డప్పతో పాటు మరో నలుగురు వైసీపీకి చెందిన వారే అయిన మంత్రి పెద్దిరెడ్డిచే కండువాలు కప్పించి, వైసీపీలోకి చేరినట్లు డ్రామాలు చేశారన్నారు. పాత కార్యకర్తలకే కండువాలు కప్పి మెప్పు పొందేందుకు వైసీపీ నాయకులు ఇలా చేశారన్నారు. ఇక, మంత్రి పెద్దిరెడ్డి ఎన్నికల ప్రచార సభలకు ఏపీఎం నరోత్తమరెడ్డి, సంఘమిత్రలు డ్వాక్రా మహిళలకు ఫోన్లు చేసి బెదిరించి తరలిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కి, వైసీపీకి కొమ్ముకాస్తున్న ఏపీఎం, సంఘమిత్రలు, వైసీపీ చేతిలో కీలుబొమ్మలుగా వ్యవహరిస్తున్న అధికారులపై ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడగానే శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.



వారం ముందు ప్రచారంలో ఉన్న వెంకటరమణ, రెడ్డప్ప

కనిపిస్తే కండువా

- వైసీపీ నేతల ఆగడాలు
- టీడీపీ నాయకుల వద్ద విలపించిన మహిళ



గ్రామంలో మహిళలకు వైసీపీ నేతలు కప్పిన కండువా

కుప్పం, ఏప్రిల్ 7: వైసీపీ నాయకులు సరికొత్త అరాచకానికి తెర తీశారు. చేరికల పేరుతో, మనిషి కనిపిస్తే చాలు పార్టీ కండువా కప్పేస్తూ అందరూ తమ పార్టీలో చేరుపోతున్నారంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఫోన్లు చేసి మరీ పిలిపించి గ్రామీణ అమాయకులతో కండువాల జాతర జరిపేస్తున్నారు. ఆ కండువా కప్పుకొన్న వ్యక్తులు బోరున విలపిస్తూ తమకు ఏ పాపం తెలియదని పక్కా టీడీపీ అభిమానులమంటూ ఆ పార్టీ నేతల వద్ద ఒట్టు పెట్టుకుంటున్నారు. ఇలాంటి ఘటన ఆదివారం కుప్పం నియోజకవర్గంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గుడుపల్లె మండలం కొడతన పల్లె పంచాయతీ సాల చింతన పల్లెలో ప్రచారానికి ఆదివారం ఎమ్మెల్సీ భరత్, జడ్పీటీసీ కృష్ణమూర్తి, సింగిల్ విండో చైర్మన్ కృష్ణమూర్తి తదితరులు వెళ్లారు. అక్కడ కొద్ది మందిని నిలబెట్టి వరుసగా కండువాలు కప్పేశారు. వీళ్లంతా టీడీపీ నుంచి తమ పార్టీలో చేరిపోయారని ప్రచారం చేశారు. వీరు కండువా కప్పిన వారిలో తిమ్మక్క అనే మహిళ కూడా ఉన్నారు. ఈ విషయం తెలిసి మండల టీడీపీ అధ్యక్షుడు బాబు, మాజీ జడ్పీటీసీ బేటప్పనాయుడు తదితరులు ఆమెను కలిశారు. తమ పార్టీ అభిమానివైన నీవు ఇలా ఎందుకు చేశావని అడిగారు. దీంతో ఆమె బోరున విలపిస్తూ వైసీపీ నాయకులు తనను మోసం చేశారని చెప్పారు. పొలం పని చేసుకుంటున్న తనను రమ్మని పిలిస్తే వెళ్లానన్నారు అక్కడి నాయకులు మిగిలిన వారితో పాటు తన మెడలోనూ కండువా కప్పేశారని చెప్పారు. ఈ కండువా కప్పే విషయం తనకు ముందుగా ఏమాత్రం తెలియదన్నారు. తర్వాత తనకు ఫోన్ చేసిన వ్యక్తిని ఇదేమని ప్రశ్నిస్తే సరైన సమాధానం ఇవ్వలేదన్నారు. తాను చంద్రబాబు అభిమానినని, నిజంగా వైసీపీ వాళ్లు అలా చేస్తారని తనకు తెలియదని కన్నీళ్లు పెట్టుకున్నారు. తర్వాత టీడీపీ నేతలు ఆమెను సముదాయించారు. తమ పార్టీ కండువా కప్పి ధైర్యం చెప్పారు. తనకు ఏ విషయం చెప్పకుండానే పిలిపించి వైసీపీ కండువా కప్పేశారంటూ టీడీపీ నాయకుల వద్ద ఏడుస్తూ చెబుతున్న తిమ్మక్క వీడియో ఆదివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఈ వీడియో చూసిన నియోజకవర్గ ప్రజలు.. హమ్మ వైసీపీ నాయకులూ, ఇదా మీ కండువాల కథ అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.



తనను పిలిచి కండువా వేశారని ఏడుస్తూ చెబుతున్న తిమ్మక్క

చతికిలపడ్డ రిజిస్ట్రేషన్లు

- వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త నిర్ణయాలతో లక్ష్యంలో 50.90 శాతానికే పరిమితం
- ఇంతలా వెనకబడటం జిల్లా స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ చరిత్రలో ఇదే తొలిసారి

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 7: జిల్లాలో స్థిరాస్తి రంగం పూర్తిగా కూలిపోయింది. రాబడికోసం రిజిస్ట్రేషన్ శాఖను వైసీపీ ప్రభుత్వం బంగారుబాతులా ఎంచుకుంది. అడ్డగోలుగా ఫీజులు పెంచేసింది. ఆస్తుల క్రయవిక్రయాలపై విపరీతమైన భారాన్ని మోపింది. ఈ అస్తవ్యస్త నిర్ణయాలతో స్టాంప్స్, రిజిస్ట్రేషన్‌శాఖ ఆదాయం భారంగా చతికిలపడింది. మూడు రాష్ట్రాలకు సరిహద్దుల్లో ఉన్న జిల్లాలో ఆదాయం నేలచూపులు చూసింది. జిల్లాలో ఎనిమిది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆదాయ లక్ష్యం రూ.181.78 కోట్లు కాగా, కేవలం రూ.92.52 కోట్లు మాత్రమే వచ్చింది. నిర్దేశించిన ఆదాయ లక్ష్యంలో 50.90 శాతం మాత్రమే సాధించింది. ఇంత వెనుకబాటులో ఉండటం జిల్లా స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ చరిత్రలో ఇదే తొలిసారి. 2022-23 సంవత్సరంలో రూ.133.32 కోట్ల లక్ష్యంలో రూ.122.50 కోట్ల లక్ష్యసాధన చేసి 68.72 శాతం వృద్ధి సాధించింది.



జిల్లా అంతటా ఇదే పరిస్థితి

జిల్లాలో ఏ ఒక్క సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కూడా నిర్దేశించిన ఆదాయ లక్ష్యాన్ని చేరుకోలేదు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి నియోజకవర్గ పరిధిలోని కార్వేటినగరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం 53.92శాతం, మంత్రి పెద్దిరెడ్డి నియోజకవర్గ పరిధిలోని పుంగనూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం 50.28 శాతం, మంత్రి ఆర్కే రోజా నియోజకవర్గంలోని నగరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయమైతే అతి తక్కువగా 43.95 శాతం దాటకపోవడం గమనార్హం.

విలువలు, రుసుం పెంచినా..

ఆదాయం పెంచుకునేందుకు ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించింది. 2023 ఏప్రిల్ నెలలో భవనాల విలువలు పెంచిన ప్రభుత్వం.. జిల్లా ప్రజలపై ఏటా రూ.12కోట్ల భారం పడేలా చేసింది. అదేనెల 25న మళ్లీ యూజర్ చార్జీలు పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. అదే ఏడాది జూన్ 1వ తేదీన జిల్లా అంతటా 10నుంచి వందశాతం వరకు భూములు, స్థలాల విలువలు పెంచింది. దీంతో ఏటా రూ.30 కోట్లకు పైగానే భారం పడేలా రిజిస్ట్రేషన్ రుసుం భారీగా పెంచింది. అన్ని విధాలుగా పెంచినప్పటికీ స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయ లక్ష్యం 50.90 శాతానికే పరిమితి కావడం గమనార్హం. భూములు, స్థలాలు విలువలు పెంచకపోయినట్లయితే ఆదాయం మరింత దయనీయంగా ఉండేదని తెలుస్తోంది.

ఎన్నికల నేపథ్యంలో..

ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో క్రయవిక్రయాలు భారీగా తగ్గనున్నాయి. నగదు తరలింపుపై ఆంక్షలు ఉండటంతో, ఆన్‌లైన్ నగదు బదిలీపై నిఘా ఉన్న నేపథ్యంలో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రిజిస్ట్రేషన్లు తగ్గే పరిణామం కనిపిస్తున్నాయి.

ఎన్నికల తర్వాత పెద్దిరెడ్డి ఆటలు సాగవు

● రాజంపేట ఎంపీ బీజేపీ అభ్యర్థి, మాజీ సీఎం కిరణ్



ముస్లింలతో మాట్లాడుతున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

రొంపిచెర్ల, ఏప్రిల్ 7: పుంగనూరు నియోజకవర్గంలో అరాచకాలు మితి మీరిపోయాయని, ప్రశ్నించేవారిపై మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మాజీ సీఎం, రాజంపేట లోక్‌సభ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. రానున్న ఎన్నికల తర్వాత వీరి ఆటలు సాగవన్నారు. మీ ప్రాంతాలు అభివృద్ధి జరగాలంటే, సమర్థులైన మంచి నాయకులకు ఓట్లేసి ఎన్నుకోవాలని కోరారు. రొంపిచెర్లలోని చిన్నమసీదు వద్ద ఆదివారం జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొని ముస్లింలతో ముచ్చటించారు. పెద్దమసీదు వద్ద ముస్లింలను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాలుగురోడ్ల కూడలిలో ప్రచారరథంపై నుంచి ప్రసంగించారు. 'అన్ని ప్రాంతాల్లో లీటరు పాలు రూ.35, మామిడి కిలో రూ.18 ఉంటే, పుంగనూరు నియోజకవర్గంలో మాత్రం పాలకు రూ.18, మామిడికి రూ.9 ఇస్తున్నారు. ఇది మోసం కాదా? ఇసుక, ఎర్రచందనం అక్రమ రవాణా, మైనింగ్‌తో దోచుకుంటున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా రూ.2,250 కోట్లతో మూడు ప్రాజెక్టులు చేపట్టగా.. తప్పుగా భావించిన ఎన్‌జీటీ రాష్ట్ర ప్రభుత్వానికి రూ.100 కోట్లు పెనాల్టీ వేసింది' అని గుర్తుచేశారు. అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీ సంక్షేమానికి తాను రూ.1200 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని ప్రజలు భయపడాల్సిన పనిలేదని, ప్రశాంత ఎన్నికల కోసం కేంద్ర బలగాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. గతంలో పుంగనూరు ఎమ్మెల్యేలుగా సీకే నారాయణరెడ్డి, మొగల్‌సైఫుల్లా బేగ్, చల్లా ప్రభాకరరెడ్డి ఎంతో అభివృద్ధి చేశారని టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. లోక్‌సభ బీజేపీ అభ్యర్థిగా నల్లారికిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపిస్తే ఆయన కేంద్ర మంత్రి అయి, మన రాష్ట్రంతోపాటు నియోజకవర్గాన్నీ అభివృద్ధి చేస్తారన్నారు. అంతకుముందు చల్లా రామచంద్రారెడ్డి ఇంటి వద్ద పలువురు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ, నేతలు పటాన్ అంజాద్‌ఖాన్, షేక్ కరీముల్లా, ఇమ్రాన్ ఖాన్, గౌస్‌పీర్‌ఖాన్, ఖలీల్‌బాషా, ఖాదర్‌బాషా, లియాకత్, మహమ్మదాలీ, ఓబులేశురెడ్డి, నాగరాజ, రామమూర్తి, అబుబకర్, రఫీ, బాబులాల్, మదనమోహన్‌రెడ్డి, మాధవరెడ్డి, అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

● బంగారు నగలు, మొబైల్ ఫోన్ స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితుడు, స్వాధీనం చేసుకున్న నగలు, ఫోన్

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 7 : అంతర్ జిల్లా దొంగను తిరుపతి వెస్ట్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. అతని నుంచి రూ.6.44 లక్షల విలువైన 129 గ్రాముల బంగారు నగలు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. తిరుపతి సంజీవయ్యనగర్‌కు చెందిన మహేష్ కొంతకాలంగా సులభ సంపాదనకు అలవాటుపడ్డాడు. తిరుపతి, చిత్తూరులోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వద్ద సిబ్బంది అవతారమెత్తాడు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో రోగులను, వారి సహాయకులను స్కానింగ్ పేరుతో నమ్మించి, నగలు, విలువైన వస్తువులు అపహరించేవాడు. తిరుపతిలోని స్విమ్స్, రుయా, రమాదేవి ఆస్పత్రుల వద్ద ఇదే తరహా మోసాలు చేశాడు. తిరుపతి పశ్చిమ పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఐ జయనాయక్ దర్యాప్తు చేపట్టారు. రహస్య సమాచారం మేరకు సీఐ జయనాయక్, ఎస్‌ఐ బాలకృష్ణ అతన్ని చెర్లోపల్లి బైపాస్ రోడ్డులోని భారతీయ విద్యాభవన్ వద్ద పట్టుకున్నారు. బంగారు నగలు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

తిరుమలలో ఉగాది ఆస్థానానికి జోరుగా ఏర్పాట్లు



ఆలయం ముందు జరుగుతున్న ఉగాది ఏర్పాట్లు

తిరుమల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఉగాది ఆస్థానానికి ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఈనెల 9వ తేదీన ఉగాది ఆస్థానాన్ని టీటీడీ నిర్వహించనుంది. ముందుగా తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాత పఠనం తరువాత శుద్ధి నిర్వహిస్తారు. ఉదయం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేస్తారు. ఉదయం 7 నుంచి 9 గంటల మధ్య విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశిస్తారు. తర్వాత శ్రీవారి మూలవిరాట్టు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపజేస్తారు. అనంతరం పంచాంగ శ్రవణం వుంటుంది. ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. కాగా, ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని 9న ఆలయంలో నిర్వహించే ఆర్జితసేవలైన అష్టదళపాదపద్మారాధన, కళ్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవ సేవలను టీటీడీ రద్దు చేసింది. ఉగాది సందర్భంగా తిరుమల క్షేత్రాన్ని పది టన్నుల సంప్రదాయ పుష్పాలతో టీటీడీ అలంకరిస్తోంది.

అంగన్వాడీ ఆశలు వమ్ము

● పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చడంలో సీఎం జగన్ విఫలం

● సమ్మెకాలానికీ వేతనం చెల్లించని ప్రభుత్వం

చిత్తూరు, ఏప్రిల్ 7: గత ఎన్నికల ముందు అంగన్వాడీ సిబ్బందికి ఇచ్చిన హామీలను సీఎం జగన్ పూర్తిగా విస్మరించారు. తెలంగాణ కంటే అదనంగా వెయ్యి రూపాయలు జీతం ఇస్తామని, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని జగన్ ఊరూరా పాదయాత్రలో బాకా ఊదారు. అధికారంలోకి వచ్చాక ఇవన్నీ పక్కన పెట్టేశారు.

వర్కర్‌కు రూ.14,500, ఆయాకు రూ.10వేలను ఇవ్వాలి

తెలంగాణ రాష్ట్రంకన్నా వెయ్యి రూపాయల జీతాన్ని అదనంగా ఇస్తామని గత ఎన్నికలకు ముందు చేపట్టిన తన పాదయాత్రలో అంగన్వాడీలకు జగన్ హామీ ఇచ్చారు. పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తామనీ చెప్పారు. వైసీపీ అధికారంలోకి రాకముందు వర్కర్లకు రూ.10,500, ఆయాలకు రూ.6వేలు ఉండేది. జగన్ అధికారంలోకి వచ్చాక రూ.వెయ్యి పెంచారు. తెలంగాణ ప్రభుత్వం పీఆర్సీ పెంచడంతో అక్కడి సిబ్బందికి వేతనాలు పెరిగాయి. ప్రస్తుతం తెలంగాణలో వర్కర్‌కు రూ.13,500, ఆయాలకు రూ.9వేల చొప్పున చెల్లిస్తున్నారు. కానీ జగన్ ప్రభుత్వం మాత్రం వర్కర్‌కు రూ.11,500, ఆయాకు రూ.7వేలను మాత్రమే ఇస్తోంది. జగన్ ఇచ్చిన హామీ మేరకు వెయ్యి చొప్పున అదనపు వేతనం ఇవ్వాలంటే.. వర్కర్‌కు రూ.14,500, ఆయాకు రూ.10వేలను ఇవ్వాలి. కానీ ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టలేదు.

ఇతర సమస్యలు పట్టని వైనం

అంగన్వాడీ వర్కర్లకు ఏళ్ల తరబడి ఉన్న సమస్యలను కూడా పరిష్కరిస్తామని జగన్ హామీ ఇచ్చారు. రిటైర్‌మెంట్ వయస్సును 62కు పెంచాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌తోపాటు మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చి, పనిభారాన్ని తగ్గించాలని వర్కర్లు కోరుతున్నారు. వీటిల్లో ఒక్క సమస్యను కూడా పరిష్కరించక పోవడంతో గత ఏడాది డిసెంబరులో 42 రోజుల పాటు నిరవధిక సమ్మె చేశారు. ఎన్నికల ముందు అంగన్వాడీ వర్కర్ల సమ్మెతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని భావించి.. సంఘ నేతలతో చర్చలు జరిపింది. రిటైర్‌మెంటు వయస్సును 62 ఏళ్లకు పెంచుతూ మాత్రమే జీవో విడుదల చేసింది. మిగిలిన డిమాండ్లకు జీవోలను విడుదల చేయలేదు. అలాగే సమ్మెకాలానికి సంబంధించిన 42 రోజుల పూర్తి వేతనాన్ని ఇస్తామని హామీ ఇచ్చి ఇంత వరకు విడుదల చేయలేదు. సమస్యలపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయడానికి కమిటీ వేస్తామని చెప్పి.. నాలుగు నెలలవుతున్నా ఆ ఊసే లేదు. జగన్ ప్రభుత్వం తమకు తీవ్ర అన్యాయం చేసిందని, రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని అంగన్‌వాడీ వర్కర్లు అంటున్నారు.

ప్రభుత్వం దగా చేసింది



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలంటూ నిరవధిక సమ్మె చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఏళ్ల తరబడి పనిచేస్తున్న మమ్మల్ని వైసీపీ ప్రభుత్వం దగా చేసింది. సమస్యలు పరిష్కరిస్తామని, సమ్మె చేసిన కాలానికి వేతనాన్ని ఇస్తామని చెప్పిన హామీని కూడా ఇంత వరకు నెరవేర్చలేదు. జీవో వచ్చేస్తోంది.. డబ్బులిస్తామని అధికారులు చెబుతున్నారే తప్ప ఇంత వరకు ఇవ్వనేలేదు.

\- సుజని, జిల్లా అధ్యక్షురాలు, అంగన్వాడీ, హెల్పర్స్ యూనియన్

అగ్నిప్రమాదంపై సీఎండీ ఆరా

ఎస్పీడీసీఎల్ స్టోర్ నిర్వహణ తీరుపై ఆగ్రహం



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఎండీ సంతోషరావు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 7: టపాసుల నిప్పురవ్వలు పడటంతో చిత్తూరు గిరింపేటలోని ఎస్పీడీసీఎల్ స్టోర్‌లో అగ్నిప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. దీనిపై సీఎండీ సంతోషరావు ఆరా తీశారు. ఆదివారం స్టోర్‌కొచ్చి అగ్ని ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. స్టోర్ నిర్వహణ సరిగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖరీదైన వస్తువులున్న చోట ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని సిబ్బందిని ప్రశ్నించారు. ఎక్కడ చూసినా స్క్రాప్ ఉందని, వెంటనే తొలగించాలని ఆదేశించారు. స్టోర్‌లోపల రోడ్లు, సిమెంట్ బెడ్లు ఏర్పాటు చేయాలని, విలువైన వస్తువులను గోడౌన్‌లో భద్రపరచాలని సూచించారు. ఎన్నికల అయిన వెంటనే ఇక్కడ నూతన ఏడీ కార్యాలయం నిర్మించనున్నట్లు చెప్పారు. ప్రహరీ కూడా మరో 10 అడుగుల ఎత్తు నిర్మించనున్నట్లు తెలిపారు. కాగా, వ్యవసాయ పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతున్నాయని, రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనవెంట ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ పద్మనాభపిళ్లై, డీఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్ తదితరులున్నారు.

పంట పొలాలపైపడ్డ ఒంటరి ఏనుగు





ధ్వంసమైన కొబ్బరి తోట - విరిగిపోయిన గేటు

ఐరాల, ఏప్రిల్ 7: ఐరాల మండలంలోని వేదగిరివారిపల్లె పంచాయతీ ఎస్టీ కాలనీలో ఆదివారం వేకువ జామున ఒంటరి ఏనుగు ఒకటి పంట పొలాలపై పడింది. గ్రామానికి చెందిన పలువురి మామిడి తోటల్లో కొమ్మలు విరిచేసింది. కొబ్బరి తోటలో చెట్లు, వరి పంటను నాశనం చేసింది. అటవీశాఖ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా వారు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి అటవీప్రాంతం వద్ద సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

వడదెబ్బతో సీఆర్పీ మృతి



సుధాకర్ శెట్టి (ఫైల్‌ఫొటో)

బంగారుపాళ్యం, ఏప్రిల్ 7: బంగారుపాళ్యం మండలం విద్యాశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో సీఆర్పీగా పనిచేస్తున్న తిమ్మోజిపల్లికి చెందిన సుధాకర్ శెట్టికి గురువారం వడదెబ్బ తగిలింది. దాంతో అయన పలమనేరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. ఆదివారం ఉదయం గుండెపోటు రావడంతో మృతి చెందాడు. ఈయన మృతిపట్ల ఎంఈవో నాగేశ్వరరావు, ఎంఈవో-2 రమేష్ బాబు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, సిబ్బంది సంతాపం తెలిపారు.

జాతీయ పోటీలకు రచనల ఆహ్వానం


చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 7: చిత్తూరు కుప్పం రెడ్డెమ్మ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది జూన్ 12వ తేదీన చిత్తూరులో జాతీయస్థాయి నవలల, కథల సంపుటాల పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు రచనలు ఆహ్వానిస్తున్నట్లు అధ్యక్షురాలు డాక్టర్ కె.రామలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రచయితలు తమ నవలలు, కథల సంపుటాలను జనవరి 2023 నుంచి డిసెంబరు 2023లోపు ప్రచురితమై ఉండాలని, అలాంటి రచనలు ఈనెల 30వ తేదీలోపు తమ కార్యాలయానికి పంపించాలని సూచించారు. నవల, కథల సంపుటాల పోటీల్లో ఎంపికైన వాటిలో రెండేసి వాటికి రూ.10వేల చొప్పున బహుమతితోపాటు సత్కరిస్తామన్నారు. రచయితలు తమ రచనలను డాక్టర్ కె.రామలక్ష్మి నర్సింగ్ హోం, సుందరయ్యవీధి, చిత్తూరు-517001కు పంపించాలని కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ రోజాప్రియ, డాక్టర్ నిరంజన్‌రెడ్డి కోరారు.

99 శాతం పింఛన్ల పంపిణీ

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 7: జిల్లాలో ఈనెల మూడో తేదీన ప్రారంభమైన పింఛన్ల పంపిణీ ఆదివారం నాటికి 99శాతం పూర్తయ్యింది. 2,73,304 మందికిగాను 2,70,858 మందికి (99శాతం) పింఛన్లు పంపిణీ చేయగా, 2,446 మందికి ఇవ్వాల్సి ఉందని అధికారులు తెలిపారు.

సంస్కృతి గొప్పదనాన్ని నేటితరానికి తెలియజెప్పాలి

ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు



ఉగాది పురస్కారాలు అందుకున్న కవులు, రచయితలు

గంగవరం, ఏప్రిల్ 7: మన సంస్కృతి, ఆచారాల గొప్పదనాన్ని నేటి తరానికి తెలియజెప్పేలా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని విశ్వశ్రీ సాహితీ సమాఖ్య అధ్యక్షుడు ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు అన్నారు. గంగవరంలోని కళా మందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉగాది పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన ప్రసంగించారు. విదేశాలకు వెళ్లినా మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన మనందరిపై ఉందన్నారు. తెలుగువారి పండుగులకు, ప్రకృతికి సంబంధం ఉందని చెప్పారు. అనంతరం తమిళనాడు హోసూరుకు చెందిన అగరం వసంత్ రచించిన 'కథమరిచిన మనిషి', 'తల్లివేరు' అనే పుస్తకాలను ఆవిష్కరించారు.

పురస్కారాలిలా..

గీతాంజలి స్మారక సాహిత్య పురస్కారాన్ని రమేష్‌నాయుడికి ప్రదానం చేశారు. అలాగే జాతీయ ఉగాది పురస్కారాలను డాక్టర్ భాస్కర్ వేడియం (కుప్పం), గండికోట వారిజ (పలమనేరు), అగరం వసంత, మునిరాజు (హోసూరు), వి.తిరుపతిరావు, రాంబాబు (కేజీఎఫ్), లక్ష్మీకాంతమ్మ (మాలూరు), రామచంద్ర, రాఘవేంద్ర (బెంగళూరు), సుధాకర్ (శ్రీకాళహస్తి), ఉమాదేవి (మదనపల్లె), గుణశేఖరన్ (గంగవరం), భాగ్యలక్ష్మి (కాణిపాకం), పూర్ణిమ (బంగారుపాళ్యం), డాక్టర్ పోలసాయి జ్యోతి (నాగర్కర్నూలు), చిరంజీవి (బైరెడ్డిపల్లి మండలం, కడపనత్తం) బాలసుందరం, దొరస్వామినాయుడు, పార్థసారథి (పలమనేరు)లకు సమితి అధ్యక్ష, కార్యదర్శులు తులసీనాథం నాయుడు, పుష్ప ప్రదానం చేశారు. అలాగే వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన 60 మంది విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, ఎన్జీవో సంఘ అధ్యక్షులు ఆనందబాబు, మాధవరెడ్డి, జేటీడీ ధనంజయ, జె.శ్రీరామచంద్రమూర్తి, విమల, ఉమామహేశ్వరరెడ్డి, విజయ్, నవీన్, వివేక్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

మినీ లారీ, కంటైనర్ ఢీ: డ్రైవర్ పరిస్థితి విషమం



సీఎంసీ సమీపంలో ఢీకొన్న కంటైనర్, మినీ లారీ



తీవ్రంగా గాయపడ్డ మినీ లారీ డ్రైవర్ ప్రతాప్

గుడిపాల, ఏప్రిల్ 7: చిత్తూరు-వేలూరు, బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిలో ఆదివారం తెల్లవారుజామున మినీ లారీ-కంటైనర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మినీ లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. చిత్తూరు నుంచి వేలూరు వైపుగా వస్తున్న మినీ లారీ, వేలూరు నుంచి చిత్తూరు వైపుగా వస్తున్న కంటైనర్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రం చిక్‌బల్లాపూర్‌కు చెందిన మినీ లారీ డ్రైవర్ ప్రతాప్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం సీఎంసీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదం కారణంగా సుమారు గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

ఏ బిడ్డా.. మంగళం మా అడ్డా!

రెచ్చిపోతున్న ఎర్రదొంగలు

● రాత్రి చందనం, పగలు గంజాయి

● భయాందోళనకు గురవుతున్న ప్రజలు



వ్యవసాయం సహా ప్రతి వృత్తికీ ఒక సీజన్ అంటూ ఉంటుంది. చివరికి దొంగలు కూడా ఎండాకాలం రాగానే జోరు పెంచుతారు. ఒక్క ఎర్రదొంగలు మాత్రమే సీజన్‌లెస్ స్మగ్లింగ్‌తో రెచ్చిపోతున్నారు. ఎన్నికల కోడ్ అడ్డు కూడా లేదు. అధికారులు, నాయకులు, ప్రజలు సకల వర్గాలూ ఎన్నికల హోరులో మునిగి తేలుతుండగా ఎర్రచందనం దొంగలు మాత్రం దర్జాగా దుంగలను అడవి దాటించే పనులు సాగిస్తున్నారు. తిరుపతి నగరంలోని మంగళం ప్రాంతం వీరికి ప్రధాన అడ్డాగా కొనసాగుతోంది.

మంగళం, ఏప్రిల్ 7 : తిరుపతి నగర శివారు ప్రాంతాలైన మంగళం ప్రాంతంలో అడవి అంచున ఉండే భూపాల్ హౌసింగ్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, తిమ్మినాయుడుపాళెం ప్రాంతాల్లో రాత్రి 11 నుంచీ అపరిచితుల కదలికలు మొదలవుతాయి. చేతిలో టార్చిలైట్లు, గొడ్డళ్లు, ఇతర సామగ్రి వీరి వద్ద ఉంటుంది. ముందుగా 20 నుంచి 30మంది శేషాచలం కొండల్లోకి అడుగుపెడతారు. కొండల్లో అంతా సేఫ్ అని సమాచారం ఇచ్చాక మిగిలినవాళ్లు కొండల్లోకి నడక మొదలు పెడతారు. తెల్లవారు జామున మళ్లీ కదలికలు పెరుగుతాయి. ఎర్రచందనం దుంగలను చిన్నచిన్న ముక్కలుగా చేసి బయటకు తెస్తారు. అప్పటికే సిద్ధంగా ఉన్న బైక్‌లు, కార్లు, జీపుల ద్వారా అవి లక్ష్యం వైపు చేరుకుంటాయి. బీటీఆర్ కాలనీకి పైభాగాన కొండ పక్కన ఉన్న ఇళ్ల మధ్య ఈ కదలికలు మరీ ఎక్కువగా ఉంటున్నాయి. స్థానికులను భయాందోళనలకు గురిచేస్తున్నాయి.బీటీఆర్‌కాలనీ, మంగళం ప్రాంతాల్లో ఇళ్లు అద్దెకు తీసుకునే అపరిచితులు నెల రోజులుగా పెరిగారని తెలుస్తోంది.పెద్దపెద్దవాళ్లే దీని వెనుక ఉన్నారని అపరిచితులు టీ బంకుల దగ్గర అలా మాటలు వదులుతారు. దీంతో మనకెందుకులే అని జనం సమాచారం కూడా ఎవరికీ ఇవ్వరు. అయితే ఎర్ర దొంగలు పనిలో పనిగా గంజాయిని కూడా వ్యాప్తిలోకి తెస్తున్నారు. ఈ కాలనీల్లోని కుర్రాళ్లను పోగేసి గంజాయికి అలవాటు చేస్తున్నారని జనం ఆందోళన చెందుతున్నారు. అడవిలోంచి ఎర్ర దుంగలను బయటకు తరలించే వాహనాలే గంజాయిని తెస్తున్నాయని ప్రచారం జరుగుతోంది. ఎన్నికల వేళ నాయకులకూ డబ్బు అవసరాలు ఎక్కువ కాబట్టే ఎర్ర స్మగ్లింగ్ జోరు పెరిగింది అనే మాటలు ఈ ప్రాంతాల్లో వినిపిస్తున్నాయి.

విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ యుగంధర్

పలమనేరు, ఏప్రిల్ 7: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్ స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఆదివారం కళాశాలలో సమావేశం నిర్వహించారు. విద్యార్థినుల ఆరోగ్య సమస్యలతోపాటు గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థినులు తమ అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు డాక్టర్ మల్లికార్జునరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ మొహమ్మద్ పాల్గొన్నారు. అనంతరం స్థానిక సాయిరాం క్లినిక్‌లో డాక్టర్ యుగంధర్, డాక్టర్ తరంగిణి పేషెంట్లకు వేసవి సందర్భంగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

టీడీపీ హయాంలో కార్మిక సమస్యలకు పరిష్కారం

కుప్పం, ఏప్రిల్ 7: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే కార్మిక సమస్యలన్నింటికీ పరిష్కరిస్తుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పం పురపాలక సంఘంలోని చంద్రన్న కార్మిక భవనంలో ఆదివారం ది ప్రైవేట్ మెకానికల్, ఇంజినీరింగ్, ఎలక్ట్రీషియన్, వెల్డింగ్ వైర్ వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఎమ్మెల్సీ మాట్లాడుతూ టీడీపీ హయాంలో కార్మికుల కోసం చంద్రబాబు ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం కార్మికులను పట్టించుకోలేదన్నారు. పలువురు కార్మిక నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్న జ్ఞానవేదిక సభ్యులు

పలమనేరు, ఏప్రిల్ 7 : ఉగాది సందర్భంగా పలమనేరు మున్సిపాలిటి నీళ్ల కుంటలో ఆదివారం ప్రబోధ సేవాసమితి, ఇందు జ్ఞానవేదిక సభ్యులు ఇంటింటికీ వెళ్లి ప్రచార కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా వారు త్రైత సిద్ధాంత భగవద్గీతపై అవగాహన కల్పించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలను అందజేశారు. ఉగాది ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రబోధ సేవాసమితి ఇందుజ్ఞానవేదిక పలమనేరు, బంగారుపాళ్యం అధ్యక్షుడు భాస్కర్, డి.బాలాజీ, సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ



భీమ, దుర్యోధన యుద్ధ సన్నివేశం

కల్లూరు, ఏప్రిల్ 7: పులిచెర్ల మండలం దిగువపోకలవారి పల్లి పంచాయతీ ఎలకబైలు కురవపల్లి సమీపంలోని భారతంమిట్టలో మహా భారత యజ్ఞంలో భాగంగా చివరిరోజు ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అలరించింది. ఉదయం ద్రౌపది ధర్మరాజుల ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ, ద్రౌపది, పాండవులు ఉత్సవ మూర్తులను ఊరేగించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో బంకమట్టితో దుర్యోధనుడి బొమ్మను రూపొందించి పూజలు నిర్వహించారు. గంగమడుగు నుంచి దుర్యోధనుడ్ని భీమసేనుడు బయటకు రప్పించే ఘట్టాన్ని కళాకారులు రక్తికట్టించారు. దుర్యోధనుడు, అనంతరం ధర్మరాజు పట్టాభిషేకం వేదోక్తంగా నిర్వహించారు. భక్తులు కంకణాలు ధరించి అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఉభయదారులుగా దిగువపోకలవారిపల్లెకు చెందిన రామచంద్ర, జనార్ధన్, వెంకటమునిఆచ్చారి, కురవపల్లెకు చెందిన బాలకృష్ణయ్య కుటుంబసభ్యులు వ్యవహరించారు.

చంద్రబాబు విజయానికి అహరహం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మణి

కుప్పం రూరల్, ఏప్రిల్ 7: ఒక్కో యువకుడు ఒక్కో సైనికునిలా మారి చంద్రబాబును లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించుకోవాలని తెలుగు యువత నాయకులు కోరారు. మల్లానూరు క్లస్టర్ తెలుగు యువత సమావేశం టి.సదుమూరు నర సింహస్వామి దేవస్థానం ఆవరణలో ఆదివారం జరిగింది. ప్రజల్లోకి వెళ్లి చంద్రన్న విజయం కోసం అహరహం పనిచేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకుడు చెక్కునత్తం మణి, పార్థ, క్లస్టర్ ఇన్‌ఛార్జి రామచంద్ర, యూనిట్ ఇన్‌ఛార్జిలు మోహన్, దాము, సంజీవి, రాజ, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ



ప్రత్యేకాలంకారంలో గంగమ్మ

చౌడేపల్లె, ఏప్రిల్7: బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. ఉదయం ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారికి ప్రీతికరమైన వేపాకు తోరణాలతో అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ ఈవో చంద్రమౌళి భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా సీతారాముల కల్యాణోత్సవం



సీతారాముల కల్యాణోత్సవం

సోమల, ఏప్రిల్ 7: పి.చెరుకువారిపల్లెలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన జరిగి 40 రోజులు పూర్తి కావడంతో శనివారం రాత్రి శాస్త్రోక్తంగా వేదపండితులచే హోమాలు నిర్వహించారు. అనంతరం కల్యాణ వేదికపై స్వామివార్ల ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి వేదమంత్రాల నడుమ కల్యాణోత్సవం జరిపారు. ఉత్సవ మూర్తులను గ్రామ వీధుల్లో కోలాటం, చెక్కభజన, బాణసంచా నడుమ ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచు సురేంద్రరెడ్డి, మాజీ సర్పంచు బాబు మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదం నుంచి లారీకి తప్పిన ముప్పు

పుంగనూరు, ఏప్రిల్ 7: పుంగనూరు-మదనపల్లె మార్గంలో ఆదివారం పూజగానిపల్లె వద్ద ఓ లారీ నుంచి మంటలు వచ్చాయి. వెంటనే లారీ డ్రైవర్ అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక అధికారి సుబ్బరాజు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని లారీ టైర్ల నుంచి మంటలను గుర్తించి అదుపు చేశారు. సిమెంట్‌ను ఎర్రగుంట్ల నుంచి వీ.కోటకు తరలిస్తున్న డ్రైవర్ తెలిపారు.

రాష్ట్రాభివృద్ధి జరగాలంటే టీడీపీ గెలవాలి

పుంగనూరు రూరల్, ఏప్రిల్7: రాష్ట్రాభివృద్ధి జరగాలంటే టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డిని గెలిపించాలని మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి పిలుపునిచ్చారు. మంగళం, ఏటవాకిలి పంచాతీల్లోని గ్రామాల్లో ఆదివారం ఇంటింటా టీడీపీ మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు.. టీడీపీ నాయకులు చిన్నమోహన్‌నాయుడు,శమిపతి, రెడ్డెప్పయాదవ్, గంగాధర్, వెంకటరమణ, జనసేన నాయకులు విరుపాక్షి, చైతన్యరాయల్ నవీన్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

పలమనేరు, ఏప్రిల్7 : పలమనేరు మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో ఆదివారం కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. టి.ఓడ్డూరు, మండిపేట, మండీపేటకోటూరు గ్రామాల్లో పలమనేరు సీఐ చంద్రశేఖర్, ఎస్.ఐ సహదేవి కేంద్ర ఎస్ఎస్‌బి బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకు డీఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు.

వైసీపీ హయాంలో హంగామా తప్ప అభివృద్ధి శూన్యం

● జయహో బీసీ సదస్సులో ఎమ్మెల్సీ శ్రీకాంత్



కనమలదొడ్డి బీసీ సమావేశంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్,తదితరులు

శాంతిపురం, ఏప్రిల్ 7: : వైసీపీ పాలనలో హంగామా తప్ప అభివృద్ధి లేదని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి పిఎస్ మునిరత్నం, కుప్పం నియోజకవర్గ విస్తర్ణ విభాగ కమిటీ కన్వీనర్ డాక్టర్ సురేష్ బాబు, కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్‌లు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కనమలదొడ్డిలో పాత టమోటా మార్కెట్ వద్ద రాళ్ళబూదుగూరు క్లస్టర్ చెందిన బీసీ నేతలతో మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు చలపతి అధ్యక్షతన జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చాకే బీసీలకు సముచిత స్థానం లభించిందన్నారు. భాష్యం విశ్వనాథనాయుడు, విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, ఉదయకుమార్, నాగరాజు, సుబ్రమణ్యం, చలపతిస్వామి, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

●రామకుప్పం, ఏప్రిల్ 7: ప్రశాంత కుప్పంలో కులచిచ్చు పెట్టాలన్న కుట్రలు, అరాచకాలు తప్ప వైసీపీ పాలకులు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని ఎమ్మెల్సీ కంచర్లశ్రీకాంత్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబులు ధ్వజమెత్తారు. ఆదివారం ఆనిగానూరులో నిర్వహించిన విజలాపురం క్లస్టర్ జయహో బీసీ సదస్సులో వారు మాట్లాడారు. ఆనందరెడ్డి, నరసింహులు, ఆంజినేయరెడ్డి, పట్రనారాయణచారి, విశ్వనాథ్, వెంకటాచలం పాల్గొన్నారు.

● కుప్పం, ఏప్రిల్ 7: ఓటుతో వైసీపీ అరాచక పాలనకు అంతం తప్పదని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పం పురపాలక సంఘం 10వ క్లస్టర్ టీడీపీ జయహో బీసీ కార్యక్రమం ఆదివారం హెచ్‌పీ రోడ్డులో జరిగింది. టీడీపీకి ఓటేయడం ద్వారా ప్రజలు తమ పవర్ జగన్‌రెడ్డికి చూపి ఇంటికి పంపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్,క్లస్టర్ ఇన్‌ఛార్జి ప్రతాప్‌లు మాట్లాడారు. కౌన్సిలర్లు, యూనిట్ ఇన్‌ఛార్జిలు, బూత్ ఇన్‌ఛార్జిలు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా

● డీఎస్పీ మహేశ్వరరెడ్డి



రౌడీషీటర్లకు డీఎస్పీ మహేశ్వరరెడ్డి కౌన్సెలింగ్

గంగవరం, ఏప్రిల్ 7: రౌడీషీటర్లు హద్దుమీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని పలమనేరు డీఎస్పీ మహేశ్వరరెడ్డి హెచ్చరించారు. ఆదివారం గంగవరం పోలీస్ స్టేషన్ ఆవరణలో గంగవరం, పద్దపంజాణి, బైరెడ్డిపల్లె మండలాల పరిధిలోని రౌడీషీటర్లకు డీఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ న్నికల కోడ్ అమల్లోకి రావడంతో రౌడీషీటర్లు జాగ్రత్తగా మెలగాలన్నారు. ఇప్పటికే కేసుల్లో ఉన్నందున, ప్రతి గ్రామంలో కదలికలపై నిఘా ఉంటుందన్నారు. గ్రామాల్లో గొడవలకు దిగినా, దౌర్జన్యాలు, దాడులకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయన్నారు. రౌడీషీటర్లు స్వగ్రామం నుంచి ఎక్కడికైనా వెళ్లాలంటే కచ్చితంగా అనుమతి పొందాలన్నారు. గంగవరం అర్బన్ సీఐ చిన్నగోవిందు, పలమనేరు రూరల్ సీఐ క్రిష్ణమోహన్, ఎస్ఐలు క్రిష్ణయ్య, శ్రీనివాసులు లతోపాటు పలువురు పాల్గొన్నారు.



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ యూత్

టీడీపీలోకి వైసీపీ యూత్

కుప్పం, ఏప్రిల్ 7: కుప్పం పురపాలక సంఘం లక్ష్మీపురానికి చెందిన వైసీపీకి చెందిన యువకులు టీడీపీ నాయకుడు సుబ్బు ఆధ్వర్యంలో ఆదివారం టీడీపీలో చేరారు. సత్తెనపల్లె ఎన్నికల ప్రచారంలో ఉన్న చంద్రబాబును వైసీపీ యూత్ శ్రీనివాసులు, గోపి, హరి, మురుగన్ మేస్త్రీలు కలిసి ఆయన సమక్షంలో పార్టీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము వైసీపీ విధానాలతో విసిగిపోయామన్నారు. ఏ వర్గానికీ ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. చంద్రబాబు నాయకత్వాన్ని నమ్మి, తమతోపాటు మరో 50 కుటుంబాలు టీడీపీలో చేరుతున్నట్లు చెప్పారు.

బీసీవై కార్యకర్తల ప్రచారం

పుంగనూరు, ఏప్రిల్7: మే నెలల్లో జరగనున్న ఎన్నికల్లో బీసీవై పార్టీ అభ్యర్థి బోడే రామచంద్రయాదవ్ గెలిపిస్తే యువతకు ఉపాధి కల్పిస్తారని బీసీవైపార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. ఆదివారం మండలంలోని గూడురుపల్లె, కుమ్మరనత్తం పంచాయతీ గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

వైసీపీ పాలనలో అన్ని వర్గాలకూ దగా:టీడీపీ



శంఖారావంలో టీడీపీ శ్రేణులు

రామకుప్పం, ఏప్రిల్ 7: వైసీపీ ప్రభుత్వ అసమర్ధ పాలనలో అస్తవ్యస్తమైన బతుకులు బాగుపడాలంటే ప్రజలంతా టీడీపీ పక్షాన నిలవాలని ఆ పార్టీ రామకుప్పం మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు అంజనేయరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి కోరారు. ఆదివారం రామకుప్పంలోని రెడ్డివీధి, కొటారుపాళ్యం, హైస్కూల్‌రోడ్ వీధుల్లో నిర్వహించిన శంఖారావం కార్యక్రమంలో వారు మాట్లాడారు. వైసీపీ చీకటి పాలనలో అన్ని వర్గాల ప్రజలు దగా పడ్డారన్నారు. నియోజక వర్గంలో చంద్రబాబును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు రామకృష్ణప్ప, సలాంసాబ్, నందారెడ్డి, పద్మనాభరెడ్డి, టీవీరవి, బాలరాజు, సుబ్రీ, సతీష్, మంజునాథ్, అవినాశ్‌రెడ్డి, ఆదిల్, నరసింహా, అమర్‌నాథ్, ఆంజీ, శంకర్, పద్మమ్మ, విజయ్‌కుమార్‌రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ఓటర్లకు అవగాహన: చల్లా



చిన్నఉప్పరపల్లెలో చల్లాబాబుకు స్వాగతం

సోమల, ఏప్రిల్ 7: టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రతి ఓటరుకూ అవగాహన కల్పించాలని పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రా రెడ్డి కోరారు. సోమల మండలం చిన్నఉప్పరపల్లె పంచాయతీలోని కమ్మపల్లె, చిన్నఉప్పరపల్లె, గట్టువారిపల్లె, చీకలవారిపల్లె, గురికానిపల్లె గ్రామాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. టీడీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలన్నారు. మ్యానిఫెస్టో పథకాల కరపత్రాలను అందజేశారు. రాష్ట్రంలోని అన్ని రంగాలూ అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యపడుతుందన్నారు. ఎన్నికల్లో ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. టీడీపీ, జనసేన పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, సూరిశెట్టి నాగభూషణం, రమేశ్‌నాయుడు, సుధాకర్, పెద్దబ్బ, ఉమాపతి నాయుడు, కొల్లా హరిప్రసాద్, సతీశ్, శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

యువకుడి అఘాయిత్యం.. యువతి ఆత్మహత్య

పుంగనూరు రూరల్, ఏప్రిల్7: ఓ యువతి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా.. భీమగానిపల్లె పంచాయతీ కమతంపల్లెకు చెందిన ఓ యువతి తన తల్లితో కలసి ఆదివారం గ్రామ సమీపంలోని సిమెంట్ ఇటుక బట్టీలో కూలీ పనులకు వెళ్లింది. అక్కడ అదే గ్రామానికి చెందిన గణేశ్ ఈ యువతిపై అత్యాచారానికి ప్రయత్నించాడు. యువతి కేకలు వేయడంతో గణేశ్ పారిపోయినట్లు బాధితురాలి తల్లి చెప్పింది. గ్రామంలోకి వెళ్లి పెద్దలకు చెబుదామని కుమార్తెకు తల్లి చెప్పింది. దీంతో బాధిత యువతి అవమానంగా భావించి చీరతో ఉరి వేసుకుంది. ఇది చూసిన తల్లి కేకలు వేడయంతో చుట్టుపక్కల ఉన్న వారు చేరుకున్నారు. అప్పటికే యువతి మృతి చెందినట్లు సమాచారం. మృతురాలి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేదలకు అన్నదానం

పూతలపట్టు, ఏప్రిల్ 7: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆదివారం జరిగిన అన్నదాన కార్యక్రమానికి పోటుకనుమ గ్రామానికి చెందిన టీడీపీ నేత ఊట్ల నాగరాజులు నాయుడు కుటుంబసభ్యులు భోజనం వితరణ చేశారు.

ఏనుగుల బెడద నుంచి విముక్తి కల్పిస్తాం

● టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు



వేదగిరివారిపల్లెలో ఎన్నికల ప్రచారం చేస్తున్న టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

ఐరాల, ఏప్రిల్ 7: ఏనుగుల బెడద నుంచి వేదగిరివారిపల్లె ప్రజలకు విముక్తి కల్పిస్తామని టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. ఆదివారం వారు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. వేదగిరివారిపల్లెలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తప్పక పరిష్కరిస్తామని తెలిపారు. ఇక్కడ నుంచి ఎన్నికల ప్రచారం మొదలు పెట్టడం ఆనందంగా ఉందన్నారు. టీడీపీ గద్దెనెక్కిన వెంటనే ఈ ప్రాంతం నుంచే అభివృద్ధిని ప్రారంభిస్తానన్నారు. ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటును సైకిల్ గుర్తుపై వేసి టీడీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, టీడీపీ నాయకులు సోమశేఖర్ నాయుడు, సందీప్, వెంకటేష్, చంద్రశేఖర్‌రెడ్డి, అరుణ్ కుమార్ నాయుడు, చౌదరి నాయుడు, రుష్యేంద్ర నాయుడు, కొల్లా రమేష్, మనోహర్ నాయుడు, ధనంజయ నాయుడు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి 47 దళిత కుటుంబాల చేరిక



టీడీపీలో చేరిన కల్లూరుపల్లి దళితవాడ కార్యకర్తలు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 7: వైసీపీకి చెందిన 47 దళిత కుటుంబాలు ఆదివారం మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. మండలంలోని కల్లూరుపల్లి పంచాయతీ దళితవాడకు చెందిన అరుణ్, విజయ్‌కుమార్, రఘుపతి, ప్రసాద్, వి.ఎం. సుబ్రహ్మణ్యం, వినాయకం, ఉషమ్మ, అములు, లలితమ్మ, లక్ష్మమ్మ తదితర 47 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువాలు కప్పి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు సాదరంగా ఆహ్వానించారు. గ్రామానికి చెందిన యువకుడు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ మేమంతా వైసీపీకి ఓటేశామని, ప్రభుత్వం తమ గ్రామంలోని 48 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించగా, అదే గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన వారు ఆ స్థలాలను మాకివ్వకుండా రాత్రికిరాత్రే మామిడి చెట్లు నాటేశారని చెప్పారు.

ఆశా వర్కర్ల జీతాలు తక్షణం చెల్లించాలి

నగరి ఏప్రిల్ 7: ఆశా వర్కర్లకు వెంటనే జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. ఆదివారం నగరి సీపీఐ కార్యాలయంలో ఆశా వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి చందామరై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం పనిచేస్తున్నా నెలకు ఇచ్చే రూ.10,000 కూడా రెండుసార్లు ఇవ్వడం విచారకరం అన్నారు. రికార్డులకు సైతం ఆశా వర్కర్లే ఏడాదికి 1500 నుంచి 2000 రూపాయలు వెచ్చించాల్సి వస్తోందని వాపోయారు.

టీడీపీ గెలుపునకు సహకరించండి

- ఎంపీ అభ్యర్థి కుమారుడు రాధే



కరపత్రాలు అందచేస్తున్న రాధే

కార్వేటినగరం, ఏప్రిల్ 7: వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలుపు చారిత్రక అవసరమని, తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు కుమారుడు రాధే పిలుపునిచ్చారు. ఆదివారం కార్వేటినగరం మండలం కత్తెరపల్లిలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలుచేసే పథకాల గురించి మహిళలకు వివరించారు. తన తండ్రి, చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో అమర్, దగ్గుమళ్ల



పలమనేరులో ఆదివారం రాత్రి ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో అమరనాథరెడ్డి, దగ్గుమళ్ల ప్రసాదరావు

పలమనేరు, ఏప్రిల్ 7: పలమనేరులో ఆదివారం రాత్రి ఏ-1 ఫంక్షన్ హాల్‌లో ముస్లింలతో మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ విందులో అమరనాథరెడ్డితో పాటు చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు టీడీపీ మైనారిటీ అధ్యక్షుడు ఖాజాపీర్, పలమనేరు నియోజకవర్గ ఎస్సీసెల్ కన్వీనర్ నాగరాజ, పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

నెల్లిపట్ల సమస్యలు పరిష్కరిస్తాం: అమర్



టీడీపీలో చేరిన వారితో అమరనాథరెడ్డి, డి.ప్రసాదరావు

పలమనేరు, ఏప్రిల్7 : బైరెడ్డిపల్లి మండలం నెల్లిపట్ల గ్రామ పంచాయితీ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మాజీ మంత్రి అమరనాథరెడ్డి, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డి.ప్రసాదరావు హామీ ఇచ్చారు. ఆదివారం రాత్రి నెల్లిపట్లలో పలువురు మండల ప్రముఖులు, నెల్లిపట్ల, పరిసర గ్రామాలకు చెందిన 150కి పైగా కుటుంబాల వారు తెలుగుదేశం, జనసేన పార్టీల్లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారందరికి అమరనాథరెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గ్రామస్తులు తమ సమస్యలను ఆయనకు నివేదించారు. దశాబ్దాలుగా తమ గ్రామం మీదుగా తమిళనాడు రాష్ట్రం అరట్లకు అంతర్రాష్ట్ర రహదారి నిర్మాణానికి నోచుకోలేదన్నారు. ఈ రహదారి ఏర్పాటు చేస్తే చాలా గ్రామాలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. అటవీ సరిహద్దులోని తమ గ్రామంతో పాటు పంచాయితీ పరిధిలోని రైతులు పండించిన పంటలను మూడు దశాబ్దాలుగా ఏనుగులు ధ్వంసం చేస్తున్నాయన్నారు. ఏనుగుల బారి నుంచి రక్షణ కల్పించాలని కోరారు. అమరనాథరెడ్డి, డి.ప్రసాదరావులు స్పందిస్తూ సమస్యలు తప్పక పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అటవీ గ్రామాల వద్ద ఏనుగులు పంట పొలాల్లోకి ప్రవేశించకుండా సోలారు విద్యుత్ కంచెను పూర్తి స్థాయిలో నిర్మిస్తామన్నారు. అంతర్రాష్ట్ర రహదారి నిర్మాణానికి తమిళనాడు రాష్ట్రంతో సంప్రదింపులు జరుపుతామన్నారు. రహదారి ఏర్పాటుకు అటవీ శాఖ నుంచి అనుమతులు తీసుకు వస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలోని పట్టురైతులకు ఐదేళ్లుగా పట్టుగూళ్ల ఇన్సెంటివ్‌ను వైసీపీ ప్రభుత్వం ఇవ్వలేకపోయిందని అమరనాథరెడ్డి అన్నారు. హంద్రీనీవాను ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందన్నారు. రాయలసీమకు చంద్రబాబునాయుడు కియా పరిశ్రమను తీసుకొచ్చి వేలాది మందికి ఉపాధి కల్పిస్తే జగన్ ప్రభుత్వం ఏమీ తేలేకపోయిందన్నారు. తెలుగుదేశం పార్టీలో మండల మాజీ ఎంపీపీ క్రిష్ణవేణి, క్రిష్ణవేణి భర్త జయకుమార్, మాజీ గ్రామపెద్ద దివంగత రాజన్న కుమారుడు గోవర్ధన్, సర్పంచ్ దంపతులు బుడ్డమ్మ, శ్యామప్ప, క్రిష్ణమనాయుడు, నల్లఉట్లపల్లి మంజు, బాలాజి, చెరకుజయచంద్ర, వార్డు సభ్యులు పర్వీన్‌తాజ్, శ్రీదేవి, మునెప్ప, వలంటీర్లు చిరంజీవి, నవీన, ఉష చేరారు. పలువురు జనసేన పార్టీలో కూడా చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్వీబాలాజి, మండల టీడీపీ కన్వీనర్ కిషోర్‌గౌడు, మండల టీడీపీ ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, జనసేన నాయకులు దిలీప్, చైతన్య, హరీష్, నాని తదితరులు పాల్గొన్నారు.

కమనీయం లక్ష్మీనారాయణుల కల్యాణం



డాక్టర్ సుదర్శనకుమార్ దంపతులకు స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 7: వేపంజేరి గ్రామంలో వెలసిన లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు చేసిన కల్యాణోత్సవాన్ని భక్తులు కనులారా వీక్షించారు. ఆదివారం ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత నారాయణుల విగ్రహాలకు పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరణలు చేసి, అర్చకుల వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చిత్తూరు నగరం మిట్టూరుకు చెందిన రిటైర్డ్ వెటర్నరీ జేడీ డాక్టర్ సుదర్శనకుమార్, శారద దంపతులు ఉభయదారులుగా వ్యవహరించగా, వారికి స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందజేశారు. ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు విష్ణుస్వామి, గోవిందస్వామి, ద్వివేది, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పార్వతీ పరమేశ్వర్లు

పెనుమూరు, ఏప్రిల్ 7: మాస శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని కావూరివారిపల్లి వద్ద వెలసిన రుణవిమోచన అనంతపద్మనాభస్వామి ఆలయంలో ఆదివారం వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం జరిగింది. అనంతరం విచ్చేసిన భక్తులకు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి కావూరివారిపల్లి గ్రామానికి చెందిన నారాయణస్వామి కుమారుడు వేణు నాయుడు కుటుంబ సభ్యులు వ్యహరించారు. నిర్వాహకులు కృపానందం పిళ్లై, నాగరాజు పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

టీడీపీలోకి దళిత కుటుంబాల చేరిక



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కల్లూరుపల్లి దళితవాడ కార్యకర్తలు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 7: వైసీపీకి చెందిన 47 దళిత కుటుంబాలు ఆదివారం మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. మండలంలోని కల్లూరుపల్లి పంచాయతీ దళితవాడకు చెందిన అరుణ్, విజయ్‌కుమార్, రఘుపతి, ప్రసాద్, వి.ఎం. సుబ్రహ్మణ్యం, వినాయకం, ఉషమ్మ, అములు, లలితమ్మ, లక్ష్మమ్మ తదితర 47 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువాలు కప్పి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు సాదరంగా ఆహ్వానించారు. గ్రామానికి చెందిన యువకుడు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ మేమంతా వైసీపీకి ఓటేశామని, ప్రభుత్వం తమ గ్రామంలోని 48 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించగా, అదే గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన వారు ఆ స్థలాలను మాకివ్వకుండా రాత్రికిరాత్రే మామిడి చెట్లు నాటేశారని చెప్పారు. మాకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా వైసీపీ వారే అడ్డుకున్నారని టీడీపీ నాయకుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే అందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణాలకు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు జయచంద్ర నాయుడు, మహేంద్ర, ఎన్‌పీ ధరణి నాయుడు, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కుప్పాల మురళి, వేణు భారతి, హేమచంద్ర నాయుడు, లోకనాథం నాయుడు, రమేష్, జనసేన నాయకులు కిషోర్, బాల, హరిప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల జీతాలు తక్షణం చెల్లించాలి: ఏఐటీయూసీ

నగరి ఏప్రిల్ 7: ఆశా వర్కర్లకు వెంటనే జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. ఆదివారం నగరి సీపీఐ కార్యాలయంలో ఆశా వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి చందామరై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం పనిచేస్తున్నా నెలకు ఇచ్చే రూ.10,000 కూడా రెండుసార్లు ఇవ్వడం విచారకరం అన్నారు. రికార్డులకు సైతం ఆశా వర్కర్లే ఏడాదికి 1500 నుంచి 2000 రూపాయలు వెచ్చించాల్సి వస్తోందని వాపోయారు. నగోమి, పుష్ప, లక్ష్మీ, ఇంద్రవేణి, పలువురు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

విజయపురం, ఏప్రిల్ 7: మండలంలోని బూచివానత్తంలో ఆదివారం చెన్నై తండయార్‌పేట ఎంఎస్ ఆస్పత్రివారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలు గ్రామాల నుంచి 90 మంది హాజరై కంటి వైద్య పరీక్ష చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంఎస్ ఆస్పత్రి వైద్యులు, క్యాంప్ ఇన్‌చార్జి నవీన్, నాయకులు వెంకటేసులు, బెన్ని, తమిళ్‌సెల్వి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం లక్ష్మీనారాయణుల కల్యాణం



డాక్టర్ సుదర్శనకుమార్ దంపతులకు స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 7: వేపంజేరి గ్రామంలో వెలసిన లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు చేసిన కల్యాణోత్సవాన్ని భక్తులు కనులారా వీక్షించారు. ఆదివారం ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత నారాయణుల విగ్రహాలకు పట్టు వస్త్రాలు, పూలహారాలతో అలంకరణలు చేసి, అర్చకుల వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చిత్తూరు నగరం మిట్టూరుకు చెందిన రిటైర్డ్ వెటర్నరీ జేడీ డాక్టర్ సుదర్శనకుమార్, శారద దంపతులు ఉభయదారులుగా వ్యవహరించగా, వారికి స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందజేశారు. ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు విష్ణుస్వామి, గోవిందస్వామి, ద్వివేది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



గర్భాలయాన్ని శుభ్రపరుస్తున్న అర్చకులు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 7: రానున్న శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలకు గాను ఆదివారం స్థానిక కోదండరామాలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఈవో సుబ్రమణ్యం నాయుడు ఆధ్వర్యంలో అర్చకులు వేణుగోపాల్ సుగంధ పరిమళాలతో తయారు చేసిన ద్రవ్యాలతో గర్భాలయంతో పాటు ఆలయ ప్రాంగణాన్ని భక్తులతో కలిసి తిరుమంజనంతో శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి మాజీ చైర్మన్ నందగోపాల్‌తో పాటు రవి బృందం, సిబ్బంది రెడ్డెప్ప, రవి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అర్జున తపస్సుమాను ఉత్సవం



తపస్సు మాను ఎక్కుతున్న అర్జున వేషధారి

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 7: నగరపాలక పరిధిలోని 21వ డివిజన్ కుక్కలపల్లె లక్ష్మయ్య కండ్రిగ ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయం ఆధ్వర్యంలో గత 11 రోజులుగా మహాభారత ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అర్జునుడు వేషధారి తపస్సుమాను కార్యక్రమాన్ని ప్రదర్శించారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తపస్సుమానుకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆ ప్రాంతమంతా జన సందోహంతో నిండిపోయింది. ఉత్సవ ధర్మకర్తలు పూల సుబ్రమణ్య ం నాయుడు, కుమారస్వామి నాయుడు, రవి నాయుడు, గోవిందప్ప, రామచంద్రయ్య, సిద్దయ్య నాయుడు, హరిబాబు నాయుడు, భక్తులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి పూర్వవైభవం

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 7: రానున్న ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే ఆంధ్ర రాష్ట్రానికి పూర్వవైభవం వస్తుందని జిల్లా తెలుగుయువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంపద సృష్టించడంతో పాటు రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్లాలంటే సీఎం హోదాలో చంద్రబాబునాయుడు అనుభవం తప్పనిసరిగా అవసరమన్నారు. ఒక్కఛాన్స్‌తోనే రాష్ట్రంలోని ప్రజలందరికీ జగన్ వ్యవహారశైలి ఇప్పటికే అర్థమైందని, ఇప్పటికే వైసీపీని తిరస్కరించారని పేర్కొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే పీడీయాక్ట్

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 7: రానున్న ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించినట్లు తెలిస్తే పీడీయాక్ట్ పెడతామని గంగాధరనెల్లూరు సీఐ శంకర్ హెచ్చరించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు గంగాధరనెల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ రోజు సైతం మీరందరూ ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసేసి ఎవరిళ్లకు వారు వెళ్లిపోయి ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలని ఆదేశించారు.

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పార్వతీ పరమేశ్వర్లు

పెనుమూరు, ఏప్రిల్ 7: మాస శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని కావూరివారిపల్లి వద్ద వెలసిన రుణవిమోచన అనంతపద్మనాభస్వామి ఆలయంలో ఆదివారం వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం జరిగింది. అనంతరం విచ్చేసిన భక్తులకు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి కావూరివారిపల్లి గ్రామానికి చెందిన నారాయణస్వామి కుమారుడు వేణు నాయుడు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. నిర్వాహకులు కృపానందం పిళ్లై, నాగరాజు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

పూతలపట్టు, ఏప్రిల్ 7: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆదివారం జరిగిన అన్నదాన కార్యక్రమానికి పోటుకనుమ గ్రామానికి చెందిన టీడీపీ నేత ఊట్ల నాగరాజులు నాయుడు కుటుంబసభ్యులు భోజనం వితరణ చేశారు.

అధికారంలోకి రాగానే మహిళలకు మూడు ఉచిత సిలిండర్లు

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడు



ముట్టుకూరుపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న జగన్మోహన్

గుడిపాల, ఏప్రిల్ 7: టీడీపీ అధికారంలోకి రాగానే మహిళలకు సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా అందించే కార్యక్రమాన్ని చేపడతామని చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడు, మాజీ ఎమ్మెల్యేలు సీకేబాబు, గాంధీ, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. ఆదివారం మండలంలోని రామభద్రాపురం, గుడిపాల, వసంతాపురం గ్రామ పంచాయతీల్లో టీడీపీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చేలా చేస్తామన్నారు. టీడీపీకి వస్తున్న జనాదరణ చూసి ఓర్వలేక కార్యకర్తలను బెదిరిస్తున్నారని, వారికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు. అనంతరం గుడిపాలలో పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మండల టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, ధనుంజయ నాయుడు, రూప్‌కుమార్, నాయకులు అనిల్‌కుమార్, హేమాద్రి నాయుడు, చెన్నకేశవులు నాయు డు, బాలాజీ నాయుడు, దీపశ్రీ, సుమతి, విజయలక్ష్మి, ఉదయ, కార్జాల అరుణ, శిల్ప, సాంబశివ నాయుడు, నవీన్, శంకర్ చౌదరి, జగదీశ్వర్ నాయుడు, ముత్తుప్రసాద్, సూరి నాయుడు, పళణి, వెంకటేష్ యాదవ్, ఈశ్వర్ నాయుడు, ప్రతాప్ నాయుడు, నవీన్, బాబు రెడ్డి, విజయభాస్కర్, హరిబాబు నాయుడు, ప్రదీప్, గోపి పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న గురజాల జగన్మోహన్ తదితరులు

ఇఫ్తార్ విందులో పాల్గొన్న జీజేఎం

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 7: చిత్తూరు నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఆదివారం నగరంలోని మార్కెట్ చౌక్ వీధిలోని మసీదులో ముస్లిం సోదరులతో కలసి దువా చేసి, విందులో పాల్గొన్నారు. ముస్లింల సంక్షేమానికి టీడీపీ పెద్దపీట వేసిందన్నారు. ఇమామ్, మౌజన్‌లకు వేతనాలు ఇవ్వడంతో పాటు హజ్ యాత్రకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఏఎస్ మనోహర్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కటారి హేమలత, నేతలు చంద్రప్రకాష్, కాజూరు బాలాజి, గురజాల మహదేవ సందీప్, అత్తుబాయ్, నవాజ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ రామ్మూర్తి మృతికి జీజేఎం నివాళి

మాజీ మున్సిపల్ కౌన్సిలర్, బలిజ సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పాల రామ్మూర్తి భౌతికకాయానికి ఆదివారం నగరంలోని ప్రభుత్వాస్పత్రి సమీపంలో ఉన్న ఆయన నివాసంలో గురజాల జగన్మోహన్ తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు.

చెరువు కాలువ కట్ట అదృశ్యం



చెరువు కాలువ కట్టను జేసీబీతో చదును చేస్తున్న దృశ్యం

కార్వేటినగరం, ఏప్రిల్ 7: కార్వేటినగరం గ్రామ పంచాయతీ నగరం చెరువుకు వెళ్లే కాలువ కట్టను శనివారం కొంతమంది జేసీబీ యంత్రంతో చదును చేసి అదృశ్యం చేశారు. గత వందేళ్లుగా ఈ చెరువు కాలువ కట్ట ఉందని రైతులు తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న చెరువు కాలువ కట్టనే జేసీబీతో చదును చేస్తుంటే రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ కాలువ కట్ట అదృశ్యమైతే చెరువులోకి నీరు ఎలా వస్తుందని అంటున్నారు. చెరువు కాలువ కట్టను పరిరక్షించడానికి రెవెన్యూ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్లనే చెరువు కాలువ గట్టు కనుమరుగవుతుందని రైతులు అంటున్నారు. చెరువు కాలువ కట్టను కాపాడటానికి జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న హస్తి భువనేశ్వరి

విజయపురం, ఏప్రిల్ 7: మండలంలోని క్షూరికాపురంలో నిరుపేద మహిళ, పురుషులకు మాజీ ఎమ్మెల్యే దొమ్మరాజు గోపాల్‌రాజు కుమార్తె హస్తి భువనేశ్వరి ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హాలీవుడ్ డైరెక్టర్లు కమలకన్నన్, రమణన్, శరణ్, ఎడిటర్లు రమేష్, మదన్‌మోహన్, ఎస్‌వీ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ జమునా దువ్వూరి, కెమిస్ట్రీ హెచ్‌వోడీ గుణశేఖర్, హస్తి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ప్రతిమ

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 7: టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యమని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సతీమణి ప్రతిమ అన్నారు. ఆదివారం నగరంలోని 4, 46వ డివిజన్లలో తెలుగు మహిళలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతిమ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలోనే మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావుకు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుమహిళ ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, వరలక్ష్మి, రాణి, శ్రీదుర్గ, నాగలక్ష్మి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

గుడిపాల, ఏప్రిల్ 7: మండలంలోని వెప్పాలమానుచేనులో ఆదివారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి ఏఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల మేరకు గుణశేఖర్, కరుణానిధి అన్నదమ్ములని, వారిలో గుణశేఖర్ వరి పైరు కోసేందుకు కోత యంత్రాన్ని తీసుకురాగా, తన పొలంలో నుంచి వెళ్లకూడదని కరుణానిధి అభ్యంతరం తెలిపాడు. దీంతో మాటామాటా పెరగడంతో గుణశేఖర్ వర్గీయులపై కరుణానిధి, అతడి కుమారులు దాడి చేశారు. దీంతో కరుణానిధి, అతడి కుమారులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

కోడిగుడ్ల పంపిణీ



చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 7: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల సమీపంలోని ఓటిచెరువు ప్రజలకు పౌల్ట్రీ ఫార్మర్స్ ఎగ్ ట్రేడర్స్ సౌజన్యంతో ఉచితంగా కోడిగుడ్ల పంపిణీ జరిగింది. నెక్ సంస్థ (హైదరాబాదు) అడ్వైజర్ డాక్టర్ కె. బాలాస్వామి సూచనతో పౌల్ట్రీ అడ్వైజర్ ఎం. సుబ్రహ్మణ్యం నాయుడు కోడిగుడ్ల పంపిణీ నిర్వహించారు.



పలమనేరులో ఆదివారం తెలుగు సాహితీ సాంస్కృతిక సమితి నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనంలో ప్రముఖ పద్య, గద్య కవి పత్తిపాటి రమేష్ నాయుడుకు గీతాంజలి స్మారక పురస్కారం అందచేస్తున్న జిల్లా నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం అధ్యక్షురాలు కె. విమల తదితరులు

ఏనుగుల బెడద నుంచి విముక్తి కల్పిస్తాం

- టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు



వేదగిరివారిపల్లెలో ఎన్నికల ప్రచారం చేస్తున్న టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

ఐరాల, ఏప్రిల్ 7: ఏనుగుల బెడద నుంచి వేదగిరివారిపల్లె ప్రజలకు విముక్తి కల్పిస్తామని టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. ఆదివారం వారు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. వేదగిరివారిపల్లెలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తప్పక పరిష్కరిస్తామని తెలిపారు. ఇక్కడ నుంచి ఎన్నికల ప్రచారం మొదలు పెట్టడం ఆనందంగా ఉందన్నారు. టీడీపీ గద్దెనెక్కిన వెంటనే ఈ ప్రాంతం నుంచే అభివృద్ధిని ప్రారంభిస్తానన్నారు. ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటును సైకిల్ గుర్తుపై వేసి టీడీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, టీడీపీ నాయకులు సోమశేఖర్ నాయుడు, సందీప్, వెంకటేష్, చంద్రశేఖర్‌రెడ్డి, అరుణ్ కుమార్ నాయుడు, చౌదరి నాయుడు, రుష్యేంద్ర నాయుడు, కొల్లా రమేష్, మనోహర్ నాయుడు, ధనంజయ నాయుడు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు సహకరించండి

- ఎంపీ అభ్యర్థి కుమారుడు రాధే



కరపత్రాలు అందచేస్తున్న రాధే

కార్వేటినగరం, ఏప్రిల్ 7: వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలుపు చారిత్రక అవసరమని, తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు కుమారుడు రాధే పిలుపునిచ్చారు. ఆదివారం కార్వేటినగరం మండలం కత్తెరపల్లిలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలుచేసే పథకాల గురించి మహిళలకు వివరించారు. తన తండ్రి, చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో అమర్, దగ్గుమళ్ల



పలమనేరులో ఆదివారం రాత్రి ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో అమరనాథరెడ్డి, దగ్గుమళ్ల ప్రసాదరావు

పలమనేరు, ఏప్రిల్ 7: పలమనేరులో ఆదివారం రాత్రి ఏ-1 ఫంక్షన్ హాల్‌లో ముస్లింలతో మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ విందులో అమరనాథరెడ్డితో పాటు చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు టీడీపీ మైనారిటీ అధ్యక్షుడు ఖాజాపీర్, పలమనేరు నియోజకవర్గ ఎస్సీసెల్ కన్వీనర్ నాగరాజ, పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

టీడీపీ పాలనతోనే పేద ప్రజల సంక్షేమం



ఇంటింటికీ కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

నింద్ర, ఏప్రిల్ 7: టీడీపీ పాలనతోనే పేద ప్రజలకు సంక్షేమం అందుతుందని నింద్ర మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని శ్రీరామపురం, ఆరూరు పంచాయతీల్లో ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నింద్ర మండలంలో అభివృద్ధి జరగాలంటే సైకిల్ గుర్తుకు ఓటేసి నగరి ఎమ్మెల్యేగా టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దశరథరామ, కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు మనోహర్ నాయుడు, కాలయ్య, చిట్టిబాబు, ఆనందరాజు, రఘుయాదవ్, మనోజ్ యాదవ్, అభిషేక్, అప్పారావు, లింగయ్య, దొరైకన్నా, శివప్రసాద్, ఢిల్లీ నాయడు, ప్రసాద్ రెడ్డి, ఏలుమలై, వెంకటేశులు నాయుడు, రవి నాయుడు, ధనంజయలు నాయుడు, లోనాథం, బాబుయాదవ్, ప్రకాష్, గాలి రమేష్ నాయుడు, రవికుమార్, నెట్టేరి జగన్, బీజేపీ నాయకులు భువనేశ్వరి, కడియాల బాలకృష్ణ పాల్గొన్నారు.

మునిసిపల్ కమిషనర్‌ను బదిలీ చేయాలి

- బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి లోకనాథం

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 7: నగరపాలకసంస్థ కమిషనర్‌ను వెంటనే బదిలీ చేయాలని బీఎస్పీ చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బి. లోకనాథం డిమాండ్ చేశారు. ఆదివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో దళితులున్న ప్రాంతంలో పారిశుధ్యం, మౌలిక వసతులు అధ్వానంగా ఉన్నాయని చెప్పారు. ఇప్పటికీ దళితుల పట్ల వివక్షచూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నగర పాలకసంస్థ కమిషనర్ తన సిబ్బంది, వలంటీర్ల ఓట్లన్నీ అధికార పార్టీకి పడేలా ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈసీ స్పందించి నియోజకవర్గంలో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వేసుకునేలా అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జీడీ నెల్లూరు బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 7: నవసమాజ నిర్మాణానికి ఓటు వజ్రాయుధంలా పనిచేస్తుందని డ్వామా పీడీ రాజశేఖర్ తెలిపారు. ఆదివారం చిత్తూరు రూరల్ మండలంలోని ముత్తుకూరు గ్రామంలో ఓటు వినియోగంపై ఉపాధి హామీ కూలీలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అర్హులందరూ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటికీ ఓటు లేని వారు ఈ నెల 15వ తేదీలోపు నమోదు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. డ్వామా అధికారులు పాల్గొన్నారు.

భానుప్రకాష్‌కే మా మద్దతు

- చెన్నై ఆత్మీయ సమావేశంలో ప్రవాసాంధ్రుల సన్మానం



గజమాలతో గాలి భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న ప్రవాసాంధ్రులు

విజయపురం, ఏప్రిల్ 7: చెన్నైలో నిర్వహించిన ప్రవాసాంధ్రుల ఆత్మీయ సమావేశంలో నగరి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌కు ప్రవాసాంధ్రులు పూర్తి మద్దతు తెలిపారు. ఆదివారం చెన్నై అన్నానగర్‌లోని టవర్స్ క్లబ్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో నగరి నియోజకవర్గానికి చెంది తమిళనాడులో నివాసముంటున్న ప్రవాసాంధ్రులు పాల్గొని భానుప్రకాష్‌ను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. భానుప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన జరుగుతోందని, రాష్ట్రాన్ని రక్షించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, ప్రవాసాంధ్రులు రావిళ్ల బాలాజి, బాలకృష్ణ, బాబు, ఓంకార్, సుబ్రహ్మణ్యంరాజు, శేఖర్‌రాజు, శివకుమార్, మధు నాయుడు, లోకేష్ రాజు, సుధాకర్‌రాజు, నగరి నియోజకవర్గ ప్రవాసాంధ్రులు పాల్గొన్నారు.

సైకిల్ గుర్తుకు ఓటేయండి: టీడీపీ



ఇంటింటి ప్రచారంలో టీడీపీ నేతలు

నగరి, ఏప్రిల్ 7: నగరి మండల పరిధిలోని థెరణి, మూలనత్తం, చిన్నతాంగళ్ గ్రామంలో మండల టీడీపీ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం ఇంటింట ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుకు ఓటేసి నగరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గాలి భానుప్రకాష్‌ను గెలిపించాలని కోరారు. టీడీపీ రాష్ట్ర మహిళా అధికారప్రతినిధి మీరా, బాలాజీ, పరంధామ నాయుడు, బాలసురేష్ నాయుడు, వరదరాజులు పాల్గొన్నారు.

వైసీపీ కోవర్టులకు కాంగ్రెస్ టికెట్లా...?

- ఏఐసీసీ సౌత్‌జోన్ అబ్జర్వర్ వద్ద నాయకుల పంచాయితీ

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 7: జిల్లాలో వైసీపీ కోవర్టులకు కాంగ్రెస్ పార్టీ టికెట్లు కేటాయించారని ఆ పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఆశావహులు ఏఐసీసీ సౌత్‌జోన్ అబ్జర్వర్ శంకర్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ టికెట్లు ఆశించిన వారితో సమావేశం నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్‌లో ఎన్నడూ కనిపించని, పనిచేయని వారికి టికెట్లు కేటాయించారని అన్నారు. కష్టకాలంలో పార్టీతో నడిచిన వారిని పక్కన పెట్టి ఎన్నికల సమయంలో వచ్చినవారికి టికెట్లు కేటాయించడం దారుణమన్నారు. ఇన్ని రోజులు పార్టీ కోసం కష్టపడిన వారి పరిస్థితి ఏంటని నిలదీశారు. చిత్తూరు టికెట్టును 67 వేల మంది ఓటర్లు ఉన్న బీసీలకు కేటాయించాలని రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు రాణి యాదవ్, జిల్లా బీసీ సెల్ నాయకులు పూర్ణచంద్ర కోరారు. తమకు టికెట్లు కేటాయిస్తే అధిక ఓట్లు సాధిస్తామని తెలిపారు. జిల్లాలో ఒక్క మహిళకైనా అవకాశం ఇవ్వాలని రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు విక్టోరియా కోరారు. కుప్పం, పలమనేరు, చంద్రగిరి నియోజకవర్గంలో సీట్లు కేటాయించిన అభ్యర్థులు ఎవరో కూడా తమకు తెలియదని, తాము పనిచేయబోమని నాయకులు తేల్చి చెప్పారు.

నగరి రూరల్ బ్యాంకు రైతుల కోసమా.. వైసీపీ కోసమా...?

- రైతుల ప్రశ్న

నగరి, ఏప్రిల్ 7: నగరి రూరల్ బ్యాంకు రైతులకు సేవలు అందించడానికా లేక వైసీపీ నాయకుల కోసం ఉందా అంటూ రైతులు ఇన్‌చార్జి సీఈఓ శేఖర్‌ను ప్రశ్నించారు. నగరి రూరల్ బ్యాంకులో సీఈఓగా వున్న వ్యక్తి తమకు అనుకూలంగా లేరని పాలకమండలికి చెందిన డైరెక్టర్ దామోదరం మంత్రి రోజా ద్వారా బదిలీ చేయడానికి ప్రయత్నించి విఫలం కావడంతో సీఈఓపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చి మెడికల్ లీవు పెట్టించడం ఎంత వరకు సబబని వారు ప్రశ్నించారు. దీనిపై నగరి రూరల్ బ్యాంకు వద్ద ఇన్‌చార్జి సీఈఓకు రైతులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సహకార సంఘం బైలా ప్రకారం పాలకమండలికి చెందిన వ్యక్తుల కుటుంబీకులకు గాని, బంధువులకు గాని, స్నేహితులకు గాని తమ సహకార బ్యాంకులో ఒప్పంద ఉద్యోగాలు, ఉద్యోగాలు ఇవ్వరాదని ఉన్న నిబంధనలను అతిక్రమించి డైరెక్టర్ దామోదరం తన కుమారుడికి ఉద్యోగం ఇప్పించుకున్నాడని ఆరోపించారు. ఎన్నికల కోడ్ అమలులో వున్న సమయంలో బదిలీలు కానీ, ఉద్యోగాలు కానీ ఇవ్వరాదనే నిబంధనలను అతిక్రమించి సీఈవోతో మెడికల్‌లీవ్ పెట్టించడం, డైరెక్టర్ కుమారుడికి ఉద్యోగం ఇప్పించడం చూస్తుంటే ఇది రైతుల బ్యాంకా, వైసీపీ బ్యాంకా అన్న సందేహం తమకు వస్తోందని వారు వాపోయారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రూరల్ బ్యాంకు మాజీ చైర్మన్ బాలసురేష్ నాయుడు, బాలాజీ, లక్ష్మీపతిరాజు, కృష్ణారెడ్డి, గుణశేఖర్, చిన్నబ్బరాజు, వరదరాజులు, నారాయణస్వామి నాయుడు, బాబు నాయుడు, పురుషోత్తం నాయుడు, గోపి రెడ్డి, గోపాల్‌శెట్టి, శివకుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ప్రత్యేక అనుబంధం
1 సోమవారం 8 ఏప్రిల్ 2024
చిత్తూరు



వైసీపీలోకి వెళ్లి రావడం నేను చేసిన పెద్ద తప్పు

పలమనేరును పారిశ్రామికంగా అభివృద్ధి చేశాను

ఐదేళ్లలో వైసీపీ ఒక్క పనీ చేయలేదు

ఆగిన చోటు నుంచే అభివృద్ధి మొదలుపెడతా!

జిల్లా అభివృద్ధి చిత్రపటంలో చెరిగిపోని ముద్రగల రాజకీయ కుటుంబంలో పుట్టి పెరిగిన నాయకుడు నూతనకాల్వ అమరనాథరెడ్డి. సర్పంచ్‌గా పుట్టిన ఊరి రుణం తీర్చుకుంటూ మొదలైన ఆయన రాజకీయ ప్రస్థానంలో పరిశ్రమల మంత్రిగా యువత ఉపాధికి విశేష కృషి చేశారు. నిరంతరం ప్రజలతోనే ఉండే అమరనాథరెడ్డి పలమనేరు నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం అభివృద్ధి ఆగిపోయిన తీరును వివరిస్తూ, ప్రణాళికాబద్ధంగా తాను చేయదలచుకున్న పనుల ఆలోచనలను పంచుకుంటూ ఆంధ్రజ్యోతితో సంభాషించారు. ఆ వివరాలు...

INTERVIEW

సర్పంచ్‌గా తొలి అడుగు

నిత్యం ప్రజల్లో ఉన్న వ్యక్తిని.చిన్న వయసులోనే రాజకీయాల్లోకి వచ్చాను. కాలేజీ నుంచి ఇంటికి వస్తానే గ్రామ పంచాయతీ సర్పంచిగా ఎన్నికయ్యాను. రెండోసారీ సర్పంచినయ్యాను. తర్వాత సెంట్రల్ బ్యాంకు ఛైర్మన్ అయ్యాను. 1996లోనే ఉప ఎన్నికలో ఎమ్మెల్యేగా గెలిచాను. నా జీవితమంతా రాజకీయాల్లోనే ఉన్నాను. నిజానికి లా చేద్దామనుకున్నా.డిగ్రీ పూర్తి చేసుకుని ఇంటికొస్తానే సర్పంచి ఎన్నికలు వచ్చాయి. సర్పంచిగా ఎన్నికయ్యాను. వీరప్పల్లికి మా తండ్రి, తల్లి సర్పంచిగా పనిచేశారు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా మా ఇంట్లో వాళ్లే ఇక్కడ సర్పంచిగా ఉండేవారు. మా తండ్రి ఎంపీ అయినా, మా అమ్మ గ్రామ పంచాయతీ సర్పంచిగానే ఉండేది. మా నాన్న ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నేను సర్పంచిగా ఉన్నాను. మా రాజకీయ జీవితం గ్రామ పంచాయతీ నుంచే మొదలైంది.

> 2019 ఎన్నికల్లో నా ఓటమికి నేను చేసిన తప్పులే కారణం. వాటిని సరిదిద్దుకున్నా. ఈసారి గెలుపు పక్కా. గతంలో నేను తెచ్చిన అభివృద్ధి పనుల్ని వైసీపీ ఆపేసింది. ఈసారి ఎలాగూ టీడీపీ ప్రభుత్వం వస్తుంది. నేను గెలుస్తాను. అభివృద్ధి పనుల్ని ఆగిపోయిన చోటు నుంచే మళ్లీ ప్రారంభిస్తా"

2019లో నా ఓటమికి కారణమిదే..

ముందు నుంచీ పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాలు టీడీపీకి పట్టున్న ప్రాంతాలు. నేను వైసీపీలోకి వెళ్లేటప్పుడు క్యాడర్‌ను కూడా తీసుకెళ్లిపోయాను. టీడీపీలోకి వచ్చేటప్పుడు క్యాడర్ పూర్తి స్థాయిలో నాతో రాలేదు. ఆ ప్రభావమే 2019 ఎన్నికల్లో నా ఓటమికి కారణమైంది. నేను పార్టీ మారకుండా టీడీపీలోనే కొనసాగి ఉంటే గత ఎన్నికల్లో ఓటమి చూసేవాడ్ని కాదు. నేను చేసిన పొరపాటుతోనే ఓటమి చూశాను. జీవితంలో మర్చిపోలేని సందర్భం అది. ఇప్పుడు క్యాడర్ మొత్తం నాతోనే ఉంది. ఇక సీనియర్లు ముద్దుకృష్ణమనాయుడి మరణం, బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అనారోగ్యం కారణంగా చంద్రబాబు నాకు జిల్లా బాధ్యతలు అప్పగించారు. పరిశ్రమల శాఖా మంత్రిగా ఉండడంతో రాష్ట్రానికి, జిల్లాకు పెట్టుబడులు తేవడంలో బిజీగా గడపడం వంటివాటితో నియోజకవర్గాన్ని చూసుకునే సమయం లేకుండా పోయింది. ఈ ఐదేళ్లలో నాకు సమయం దొరికింది. క్యాడర్‌కు అందుబాటులో ఉంటూ వారిలో నమ్మకాన్ని కలిగించాను.

మంత్రిగా పలమనేరుకు చాలా చేశా

కేంద్ర ప్రభుత్వం దేశానికి రెండు ఎంఎస్ఎంఈలను ఇస్తే అందులో ఒకటి పలమనేరు ప్రాంతానికి తెచ్చాను. గండ్రాజుపల్లె ప్రాంతాన్ని పారిశ్రామికవాడగా అభివృద్ధి చేశాను. అనేక రకాల ముఖ్యమైన పరిశ్రమలు కుర్లాన్, పార్లే, సుచియార్ వంటి వచ్చాయి. నాలుగురోడ్ల మీదుగా బెంగళూరుకు వెళ్లేవారికి పరిశ్రమలు వచ్చిన మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. పలమనేరు పట్టణంలో ఆటోనగర్ కావాలనే డిమాండ్ చాలాకాలంగా ఉండేది. మంత్రి అయిన మొదట్లోనే 40 ఎకరాల భూమిని సేకరించి ఏపీఐఐసీ ద్వారా అభివృద్ధి చేశాం. పార్టీలకు సంబంధం లేకుండా, ఎలాంటి సిఫార్సులు లేకుండా వాళ్లు పెట్టుకున్న డీపీఆర్ దరఖాస్తు ప్రకారం స్థలాలిచ్చాం. ఇప్పుడు ఆటోనగర్ అద్భుతంగా ఉంది. 22 నెలలే నేను మంత్రిగా ఉన్నాను. తొలిసారి మంత్రి కావడం, అందులోనూ అవగాహన లేని పరిశ్రమల శాఖ తీసుకోవడంతో నాకు అన్నీ అర్థమయ్యేసరికి ఆరేడు నెలలు పట్టింది. ఎన్నికలకు ముందు మూడు నాలుగు నెలలు పనిచేయలేం. అంటే మొత్తంగా నేను మంత్రిగా పనిచేసింది ఏడాదికాలమే. ఈ ఏడాదిలోనే అభివృద్ధి చేసి చూపించాను.

నా కొడుక్కి ఆసక్తి లేదు

రాజకీయాల్లో బిజీగా ఉండడంతో నా ఒక్కగానొక్క కొడుకును ఒకటో తరగతి నుంచే హాస్టల్‌లో చేర్పించి చదివించాను. నా కొడుకు పుట్టి పెరిగిన వాతావరణం కారణంగా అతనికి రాజకీయాల మీద ఆసక్తి లేకుండా పోయింది. అతను ఇప్పుడు లండన్‌లో ఉద్యోగం చేసుకుంటున్నాడు. అతనికి ఆసక్తి ఉంటే రాజకీయాల్లోకి రావచ్చు. లేకుంటే లేదు. నేను బలవంతం చేయను.

టీడీపీ హయాంలోనే జిల్లాకు హంద్రీనీవా నీళ్లు..

గత టీడీపీ హయాంలోనే హంద్రీనీవా నీళ్లు జిల్లాకు వచ్చాయి. జిల్లాలోకి ప్రవేశించే సమయంలో సరిహద్దు వద్ద నేను మంత్రి హోదాలో కొబ్బరి కాయ కొట్టి నీళ్లను తెచ్చాను. చంద్రబాబు స్వయంగా వి.కోటలో నీళ్లను వదిలారు. పలమనేరు నియోజకవర్గం నుంచి కుప్పం వరకు నీళ్లు వెళ్లకుండా అప్పటి వైసీపీ కుప్పం ఇన్‌ఛార్జి చంద్రమౌళి కోర్టు కేసులు వేసి ఆపేయించారు.ఇప్పుడు కుప్పానికి నీళ్లిచ్చామని హడావిడి చేశారు. మరుసటిరోజు కాలువ ఎండిపోయింది. జగన్‌ను ప్రజలు నమ్మడం లేదు.

> ఎమ్మెల్యేగా ఉన్న ఐదేళ్లలో కనీసం రెండు మూడుసార్లు నియోజకవర్గంలోని అన్ని ఇళ్లు తిరగడం నాకు అలవాటు. ఈసారి కరోనా వల్ల కొంతవరకు ప్రజల్లోకి వెళ్లలేదు. అందులోనూ ప్రతిపక్షంలో ఉన్నాను. అధికారంలో ఉన్నవారు ఏం చేస్తారో చూద్దామని సమయం వారికిచ్చాను. ఏడాదికి ముందు నుంచే ప్రతి ఇంటికీ తిరిగాను. ఈసారి సహాయం చేయమని వాళ్లను కోరాను.

షాదీమహళ్లకు మా నాన్న ఆద్యుడు

మైనార్టీలు ఎక్కువగా ఉండే ప్రాంతమిది. వాళ్లల్లో ఎక్కువ మంది పేదోళ్లు ఉంటారు. వారి పిల్లల్లో కూడా చదువు తక్కువ. మా తండ్రి హయాం నుంచి కూడా మైనార్టీలకు విద్య, ఉపాధి పరంగా దృష్టి పెట్టాం. వారి కమ్యూనిటీకి సంబంధించి రాష్ట్రంలోనే తొలిసారి పుంగనూరులో మా తండ్రి షాదీమహల్ కట్టించారు. ఆ తర్వాత నుంచే చంద్రబాబు షాదీమహళ్ల ఏర్పాటును అమలు చేశారు. పలమనేరులోని రెండు షాదీమహళ్ల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయించాను.వైసీపీ వచ్చాక ఆ నిధులు ఇవ్వకపోవడంతో మైనార్టీలే చందాలు వేసుకుని పనులు పూర్తి చేసుకున్నారు. రాయలపేటలో, బైరెడ్డిపల్లె, ముతుకూరు ప్రాంతాల్లో షాదీమహళ్లను నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే పూర్తి చేశాను. మైనార్టీలు ఎక్కువగా ఉన్న పలమనేరు, వి.కోట ప్రాంతాల్లో రూ.కోటితో షాదీమహళ్లను మంజూరు చేయించాను. పనులు ప్రారంభమైనా ఇప్పటికీ పిల్లర్స్ అలాగే మిగిలిపోయాయి. మైనార్టీ అమ్మాయిల చదువు కోసం జూనియర్ రెసిడెన్షియల్ స్కూల్‌ను రూ.15 కోట్లతో మంజూరు చేయించాను. వి.కోటలో స్థలాన్ని కేటాయించాం. ఆ స్థలంలో పట్టాలిచ్చేందుకు వైసీపీ నాయకులు ప్రయత్నించారు. నేను కలెక్టర్‌తో మాట్లాడి అడ్డుకున్నాను. వి.కోటలో నేను మంజూరు చేయించిన రెసిడెన్షియల్ స్కూల్ ఇప్పుడు చిత్తూరులో అద్దె భవనంలో నడుస్తోంది. ఎమ్మెల్యే సొంత మండలంలో ఈ పరిస్థితి ఉంది. పలమనేరులో మా తండ్రి హయాంలోనే ఉర్దూ హైస్కూల్ ఏర్పాటు చేశాం. వి.కోట జూనియర్ కాలేజీలో ఉర్దూ సెక్షన్ తీసుకొచ్చాను. మైనార్టీలకు చేస్తున్న పనులన్నీ వైసీపీ ప్రభుత్వం ఆపేసింది.

టీడీపీతో బంధం ఇలా..

మా తండ్రి సమితి ప్రెసిడెంట్‌గా, చంద్రబాబు మంత్రిగా.. ఇద్దరూ కాంగ్రెస్‌లో ఉన్నారు అప్పుడు. ఎన్టీఆర్ పార్టీ పెట్టిన తర్వాత.. చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన మణిమంత నాయుడితో ఉన్న సంబంధం వల్ల నేను మాత్రం టీడీపీలో చేరాను. ఆ రోజు ఒక రూపాయి సభ్యత్వం కట్టాను. చౌడేపల్లె సమితి మొత్తం నేను ఒక రూపాయి సభ్యత్వాలు చేయించాను. టీడీపీతో సంబంధాలు ఎన్టీయార్ నుంచే ఉన్నాయి.

వైసీపీలోకి వెళ్లినా ఎన్టీఆర్ ఫొటో తీయలేదు..

టీడీపీలో దశాబ్దాలుగా పనిచేసిన నాకు చంద్రబాబుతో కొన్ని అభిప్రాయబేధాలొచ్చాయి. జగన్ జైల్లో ఉండగానే నేను ఎమ్మెల్యేగా వైసీపీలోకి వెళ్లాను. పార్టీ మారినా నా ఇంట్లో, హైదరాబాదులోని నా క్వార్టర్స్‌లో ఎన్టీఆర్ ఫొటోను తొలగించలేదు. ఇంట్లో పసుపు రంగు కుర్చీలను కూడా తీయలేదు. చంద్రబాబు, లోకేశ్ నన్ను మళ్లీ పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో మళ్లీ ఎమ్మెల్యేగానే టీడీపీలోకి వచ్చాను.

- మిగతా 2వ పేజీలో -



అమర్ కుటుంబంతోనే మైనార్టీల సంక్షేమం

మైనారిటీల సంక్షేమం కోసం అమరనాథరెడ్డి కుటుంబం దశాబ్దాలుగా సహకరిస్తోంది. దివంగత ఎంపీ రామకృష్ణారెడ్డి పలమనేరులో బాలుర ఉర్దూ ఉన్నత పాఠశాలకు స్థలాన్ని కేటాయించి, భవన నిర్మాణాలకు కృషి చేశారు. మంత్రిగా అమరనాథరెడ్డి వి.కోటలో బాలికల రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసి.. శంకుస్థాపన చేశారు. పలమనేరులో ఈద్గా వద్ద షాదీమహల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, పనులు ప్రారంభించారు. దండపల్లిరోడ్డు, జండామఠంలోని షాదీఖానాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే కక్ష కట్టి ఈ పనులు ఆపేశారు. ఇప్పుడు అమరనాథరెడ్డి గెలిచి, టీడీపీ అధికారంలోకి వస్తేనే ఈ పనులన్నీ పూర్తవుతాయని మైనారిటీలు భావిస్తున్నారు. అమరనాథరెడ్డికి ఓట్లేసి గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నాం.

- ఖాజాపీర్, మైనారిటీ కన్వీనర్

ఈ ప్రభుత్వంపై ఉద్యోగులకు నమ్మకం పోయింది

వైసీపీ పాలనలో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు తమకు రావాల్సిన డీఏ బకాయిలు, పీఆర్సీ పొందలేకపోయారు. ఈ ప్రభుత్వంపై వీరందరికీ నమ్మకం పోయింది. చంద్రబాబు హయాంలో ఏనాడు బకాయిల కోసం ఏళ్లతరబడి ఉద్యోగులు ఎదురు చూసిన దాఖలాలు లేవు. ఇక, అనుభవం, విజన్ ఉన్న అమరనాథరెడ్డి హయాంలో అభివృద్ధి జరిగింది. అందుకే మేమంతా ఆయన గెలుపు కోసం ఎదురు చూస్తున్నాం.


- కృష్ణమూర్తి, విశ్రాంత తహసీల్దారు



ఇంటర్వ్యూ

పలమనేరు అభివృద్ధిపై కక్షగట్టారు

మొదటి పేజీ తరువాయి



మార్కెట్ కమిటీ కోల్డ్ స్టోరేజ్‌ను వాళ్లు పట్టించుకోలేదు

33 ఎకరాల్లో అడ్వాన్స్ ఇంటిగ్రేటెడ్ ఫెసిలిటీతో హైవే పక్కన పలమనేరు మార్కెట్ కమిటీ ఏర్పాటు చేసేందుకు భూసేకరణ చేసినా ఇప్పటికీ అక్కడ అడుగు ముందుకు పడలేదు. మా ప్రాంతంలో పండ్ల తోటల సాగు అధికం. అందుకే వి.కోటలో కోల్డ్ స్టోరేజీ నిర్మాణాన్ని సగం పూర్తి చేస్తే వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టరుకు బిల్లులు ఇవ్వలేదు. దీంతో ఆయన నిర్మాణాన్ని ఆపేశారు.

పట్టు రైతులున్నా ప్రోత్సాహకాలు లేవు

మా ప్రాంతంలో (పలమనేరు, కుప్పం, పుంగనూరు) పట్టుపరిశ్రమ అధికంగా ఉంది. టీడీపీ హయాంలో కిలోకు రూ.50 ప్రోత్సాహకాన్ని ఇచ్చేవాళ్లం. వైసీపీ వచ్చాక దాన్ని ఆపేసింది. రైతులకు కొన్ని కోట్ల రూపాయలు ప్రభుత్వం బాకీ ఉంది. పట్టు రైతులకు షెడ్ల నిర్మాణానికి టీడీపీ డబ్బులిచ్చేది. రైతులకు ఒక్క రూపాయి వచ్చే పరిస్థితి లేదు. పట్టు రైతులను వైసీపీ ప్రభుత్వం నాశనం చేసింది.

ముందుకు సాగని 'కైగల్'

బైరెడ్డిపల్లె, వి.కోట మండలాలకు తాగు, సాగునీరు అందించాలనే ఉద్దేశంతో అమరనాథరెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు చర్యలు చేపట్టారు. బైరెడ్డిపల్లె మండలంలోని కైగల్ నదీజలాలను సద్వినియోగపరచడానికి గాను రిజర్వాయర్ పనులకు రూ.20కోట్లు మంజూరు చేయించారు. కైగల్‌లో వృథాగా పోతున్న నీటిని నిల్వచేసి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టడానికి అప్పట్లో కైగల్ వద్ద శిలాఫలకం ఏర్పాటుచేసి శంకుస్థాపన చేశారు. ఈ రిజర్వాయర్ పూర్తయితే దాదాపు 500 ఎకరాలకు సాగునీరందడమే గాక తాగునీటి సమస్య కూడా తీరుతుందని ఈప్రాంత రైతులు, ప్రజలు ఆశాతో ఉన్నారు. కానీ, తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ రిజర్వాయరు గురించి పట్టించుకోలేదు.దీంతో ఆ పనులు పెండింగ్‌లో పడ్డాయి. ఈసారి ఎన్నికల్లో అమరనాథరెడ్డి గెలిచిన వెంటనే కైగల్ రిజర్వాయరుకు మోక్షం కలుగుతుందన్న ఆశాభావంతో ప్రజలు ఉన్నారు.



కైగల్ రిజర్వాయర్ పనులకు శంకుస్థాపన చేస్తున్న అమరనాథరెడ్డి(ఫైల్‌ఫోటో)

కళాక్షేత్రం, బీసీ, అంబేద్కర్, కాపు భవన్‌లన్నీ ఆగిపోయాయి

పలమనేరులో కళాక్షేత్రం కావాలని స్థానికుల డిమాండ్. దాన్ని మంజూరు చేస్తే ఆపేశారు. బీసీ భవన్ కావాలని బీసీలు కోరారు. నిర్మాణానికి భూమి లేకపోవడంతో పట్టణంలోని విలువైన భూమిని ఫిషరీష్ డిపార్ట్‌మెంట్ నుంచి తీసుకుని అప్పగించాను.రూ.50 లక్షలు మంజూరు చేయించాను. ఈ వైసీపీ నాయకులు దాన్ని కొట్టేసే ప్రయత్నం చేశారు. బీసీలంతా అడ్డుపడితే భూమి ఆగింది. డబ్బు కూడా అలాగే ఉంది. ఎస్సీలకు రూ.కోటితో పలమనేరు, వి.కోట ప్రాంతాల్లో అంబేద్కర్ భవన్లను మంజూరు చేస్తే ఆపేశారు. కాపు భవన్ కూడా ఆపేశారు. వీటి మీద దృష్టి పెట్టరు కానీ, బటన్లు నొక్కుతున్నాం అంటున్నారు.

సొంతంగా అన్నా క్యాంటీన్ నిర్వహించాం..

పలమనేరులోని అన్నా క్యాంటీన్‌ను ఆపేశారు. మేమే సొంత నిధులు, స్పాన్సర్ నిధులతో సుమారు 309 రోజులు క్యాంటీన్ నిర్వహించాం. ఎన్నికల కోడ్ కారణంగా ఇటీవల దాన్ని ఆపేశాం.

మేమొచ్చాక టిడ్కో ఇళ్లు ఇస్తాం

పలమనేరులో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. భూమిని కేటాయించింది. లబ్ధిదారులు కూడా డిపాజిట్లు చేశారు. వైసీపీ ప్రభుత్వం ఆ ఇళ్లను రద్దు చేసింది. లబ్ధిదారులకు డబ్బులు వెనక్కి ఇవ్వలేదు. టీడీపీ వచ్చాక అర్హులైన వారందరికీ టిడ్కో ఇళ్లను ఇస్తాం.

గెలిచాక చేసే పనులు...

నేను మంజూరు చేసి ఆగిపోయిన పనుల్ని మళ్లీ నేనే పూర్తి చేస్తాను. యువత ఉపాధి కోసం బయటికి వెళ్లకుండా పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేస్తా. గతంలో తక్కువ సమయం అవకాశం ఉండడంతో పూర్తి స్థాయిలో చేయలేకపోయాను. పెట్టుబడులు తెచ్చి లోకల్ ఎంప్లాయిమెంట్ ఇస్తాను. రైతుల కోసం ముందు నుంచీ టీడీపీ చేస్తున్న కార్యక్రమాలను కొనసాగిస్తాను.

రూ.వందల కోట్ల రోడ్లను రద్దు చేశారు

ప్రతి గ్రామంలో సీసీ రోడ్లను వేశాం. ఇలా నియోజకవర్గంలో రూ.వంద కోట్లతో నిర్మించాం. మరో రూ.160 కోట్ల రోడ్లను మంజూరు చేయిస్తే రద్దు చేశారు. మంత్రిగా ఉన్నప్పుడు ఏసియన్ బ్యాంకు నుంచి రూ.130 కోట్లు తెచ్చి రోడ్డు పనులు తెచ్చాను. దాన్నీ పట్టించుకోలేదు. ఎస్సీ ఎస్టీ కాంపొనెంట్ కింద రూ.47 కోట్ల రోడ్లను తెచ్చాను. రాయలపేట నుంచి చిత్తూరుకు రోడ్డును కష్టపడి మంజూరు చేయిస్తే పట్టించుకోలేదు.



చంద్రబాబుతో, లోకేశ్‌తో సాన్నిహిత్యం

గతంలో కూడా నేను మంత్రి పదవి ఆశించలేదు. చంద్రబాబు పిలిచి నన్ను మంత్రిని చేశారు. మా తండ్రితో చంద్రబాబుకు మంచి అనుబంధం ఉంది. లోకేశ్ పాదయాత్ర సమయంలోనూ రాయలసీమ మొత్తం తిరిగాను. ఇలా లోకేశ్‌తోనూ నాకు మంచి సాన్నిహిత్యం ఉంది. నాకు మంత్రి పదవే అని కాదు, నేను ఎమ్మెల్యేగానే ఉంటూ ఏం అడిగినా చేస్తారనే నమ్మకం ఉంది. మంత్రి కాకపోతేనే నా నియోజకవర్గ ప్రజలకు ఉపయోగం. నియోజకవర్గం మీద దృష్టి పెట్టి వారికి అందుబాటులో ఉంటాను. మంత్రి అయితే జిల్లా, రాష్ట్ర బాధ్యతలు కూడా చూడాల్సి ఉంటుంది.


అక్రమ కేసులతో రెండున్నర నెలలు బయటే

నా మీద వైసీపీ ప్రభుత్వం 33 అక్రమ కేసులను పెట్టింది. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తే కేసులు పెట్టేస్తున్నారు. హత్యాయత్నం కేసులు పెడితే రెండున్నర నెలలు బయట ఉండాల్సి వచ్చింది. చంద్రబాబు మాలాగా బయటికి వెళ్లలేరు కాబట్టి జైలుకు వెళ్లాల్సి వచ్చింది. అప్పట్లో మేమూ జైలుకు పోతామంటే చంద్రబాబు ఒప్పుకోలేదు. బెయిల్ తీసుకుని అందుబాటులోకి వచ్చాను. చిత్తూరుతో పాటు తిరుపతి, నెల్లూరు, అన్నమయ్య, అనంతపురం జిల్లాల్లోనూ కేసులు పెట్టారు.



పలమనేరులో కళామందిరం కోసం నాడు అమరనాథరెడ్డి శంకుస్థాపన చేసిన స్థలమిది. దీని నిర్మాణం చేపట్టకపోవడంతో పిచ్చిమొక్కలతో నిండిపోయి ఉంది.

గంగన్న శిరస్సు జలపాతం వద్ద రూ.35 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణానికి టీడీపీలో అమరనాథరెడ్డి నిధులు మంజూరు చేయించినా.. వైసీపీ అధికారంలోకి వచ్చాక అటకెక్కించింది. దీంతో పలమనేరు ప్రజలకు తాగునీటి సమస్య తీరడంలేదు.





బీసీలకు నాటి మేళ్లు.. నేటి అన్యాయాన్ని వివరిస్తాం

బీసీ కార్పొరేషన్ ద్వారా టీడీపీ హయాంలో ఎంతోమంది లబ్ధి పొందారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం బీసీలను విస్మరించి అన్యాయం చేస్తోంది. వీటన్నింటినీ బీసీలకు వివరిస్తాం. అవగాహన కల్పిస్తాం. ఇలా.. అమరన్నను గెలిపించుకోవడానికి తగిన ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. నియోజకవర్గంలో బీసీల సంక్షేమానికి కృషి చేసింది టీడీపీ.. అమరనాథరెడ్డే.

- సుబ్రమణ్యంశెట్టి, బైరెడ్డిపల్లె మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి

అభివృద్ధి అమర్‌తోనే సాధ్యం

అమరనాథరెడ్డి ఇప్పటి వరకు మండలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆయన తండ్రి, మాజీ ఎంపీ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో పాఠశాలలు ఏర్పాటు చేశారు. విద్యకు పెద్ద పీట వేశారు. మండలంలో ప్రతి కుటుంబంలో ఒకరిగా మెలిగారు. ప్రతి కుటుంబం వారు తమ ఆరాధ్య దైవంగా భావించి ఆదరిస్తున్నారు. అమరనాథరెడ్డితోనే అభివృద్ధి సాధ్యం

- శ్రీరాములు, జిల్లా టీడీపీ నేత, పెద్దపంజాణి మండలం



అమర్ చేసిన అభివృద్ధే మిగిలింది

గుర్తు చేసుకుంటున్న బైరెడ్డిపల్లె ప్రజలు



గతమే ఘనం

● బైరెడ్డిపల్లె మండలంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమరనాథరెడ్డి మంత్రిగా పలు అభివృద్ధి పనులు పూర్తిచేశారు. అమరనాథరెడ్డి మంత్రిగా ప్రత్యేకశ్రద్ధ తీసుకుని చేసిన అభివృద్ధిపనుల గురించి ఇప్పటికీ ప్రజలు గుర్తుచేసుకుంటూనే వున్నారు. ముఖ్యంగా మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో సిమెంటురోడ్లు దాదాపు అమరనాథరెడ్డి హయాంలోనే నిర్మించారు.



● మండలంలోని కడపనత్తం గ్రామంలో రూ. 1.09 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం జరిగింది. దీనివల్ల ఈ ప్రాంతంలో దాదాపు 10 గ్రామాలకు విద్యుత్‌సమస్య లేకుండా సరఫరా జరుగుతుండడంతో రైతులు, ప్రజలు సంతృప్తి చెందుతున్నారు.

● మండలంలోని 21 పంచాయతీల్లో అమరనాథరెడ్డి మంజూరు చేయించిన రూ. 72.94 కోట్ల నిధులతో పలుగ్రామాల్లో సిమెంటురోడ్లు నిర్మించారు. దీంతో ఎన్నోయేళ్లుగా సీసీరోడ్లు లేక ఇబ్బందిపడుతున్న గ్రామాల్లోని ప్రజలకు సౌకర్యం ఏర్పడింది. గ్రామాల్లో సీసీరోడ్లు ఏర్పాటు చేయడంపట్ల ఇప్పటికీ ప్రజలు అమరనాథరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

● మండలంలోని ఎం.కొత్తూరు, రామసముద్రం, కైగల్ గ్రామాల్లో అమరనాథరెడ్డి మంజూరు చేయించిన నిధులతో అంగన్‌వాడీ భవనాలు నిర్మించారు. దీంతో అంగన్‌వాడీకేంద్రాలకు వెళ్లే పిల్లలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చక్కగా చదువుకుంటున్నారు.





● ఎం.కొత్తూరు పంచాయతీ పరిధిలో అమరనాథరెడ్డి మంజూరు చేయించిన దాదాపు రూ. 35 లక్షల నిధులతో నాలుగు చెక్‌డ్యాములు నిర్మించడం జరిగింది. దీనివల్ల వర్షపునీరు చెక్‌డ్యాముల్లో నిల్వచేరి భూగర్భజలాలు వృద్ధి చెంది బోర్లలో నీటిమట్టం పెరిగి రైతులకు సాగునీటిసమస్య లేకుండా వ్యవసాయ అవసరాలకు చక్కగా ఉపయోగపడుతుండడంతో రైతులు సంతోషిస్తున్నారు. చెక్‌డ్యాముల నిర్మాణంవల్ల తమకు ఎంతో ప్రయోజనం కలుగుతోందని వారు అమరన్నకు కృతజ్ఞతలు చెబుతున్నారు. ఇదేవిధంగా మండలంలోని నెల్లిపట్ల పంచాయతీ పరిధిలో కూడా దాదాపు రూ. 50 లక్షలతో 5 చెక్‌డ్యాములు నిర్మించారు. తీర్థం పంచాయతీ పరిధిలో రెండు చెక్‌డ్యాములు నిర్మించారు. దీనివల్ల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతోంది.

● మండలంలోని అన్ని పంచాయతీల్లో తాగునీటి అవసరాల కోసం అప్పట్లో మంత్రిగా వున్న అమరనాథరెడ్డి రూ. 2కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో గ్రామాల్లో అవసరమైనచోట తాగునీటిపైపులకు మరమ్మతులు, రక్షిత బోరు మోటర్ల ఏర్పాటు, బోరుడ్రిల్లింగ్‌పనులకు నిధులను వినియోగించి, తాగునీటిసమస్య పరిష్కారానికి కృషిచేశారు.



● మండలంలోని నెల్లిపట్ల పంచాయతీ పరిధిలో అమరనాథరెడ్డి మంజూరుచేసిన నిధులతో బాపలనత్తం నుంచి విరూపాక్షపురం గ్రామానికి తారురోడ్డు నిర్మించారు. దీనివల్ల గతంలో మట్టిరోడ్డుపై అవస్థలు పడుతూ ప్రయాణిస్తున్న ఈ ప్రాంత గ్రామీణప్రజలకు తారురోడ్డు ఏర్పాటుకావడంతో ఎంతో సౌకర్యం కలిగింది. ఈ రహదారిని ఏర్పాటుచేసిన అమరన్నకు తాము ఎప్పటికీ రుణపడివుంటామని పలువురు అంటున్నారు.

వర్తమానం దైన్యం

● మండలంలోని కడతట్లపల్లెలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి అమరనాథరెడ్డి రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. అయితే అంగన్‌వాడీభవన నిర్మాణపనులు పూర్తిచేయడానికి ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపకపోవడంతో అంసపూర్తిగా మిగిలివుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● మండలంలోని పెద్దచెల్లారగుంట నుంచి తాతిరెడ్డిపల్లె, చుక్కోనితోపు వరకు తారురోడ్డు నిర్మాణానికి గాను అమరనాథరెడ్డి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించినా ఎన్నికలు రావడంతో అప్పట్లో పనులకు బ్రేక్‌పడింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ రహదారి గురించి పట్టించుకోకపోవడంతో కంకరతేలిపోయి ఇప్పటికీ అంసపూర్తిగానే వుంది. మళ్లీ అమరన్న గెలిచి పెండింగ్‌లోవున్న రహదారి పనులను పూర్తిచేయిస్తారని ఈప్రాంతప్రజలు ఎదురుచూస్తున్నారు. రహదారిపనులను గాలికొదిలేసి పట్టించుకోని వైసీపీసర్కారు పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.



అసంపూర్తిగా వదిలేసిన తాతిరెడ్డిపల్లె - గాజీపేట రహదారి

● మండలంలోని తీర్థంవద్ద పాడిరైతుల సౌకర్యంకోసం అమరనాథరెడ్డి పాలశీతలీకరణ కేంద్ర నిర్మాణానికిగాను నిధులు మంజూరు చేసినా పనులు అర్ధంతరంగా ఆగిపోయింది. దీన్ని పూర్తిచేసి పాడిరైతులకు సౌకర్యంగా వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.



తీర్థం వద్ద అసంపూర్తిగా వదిలేసివున్న పాలశీతలీకరణకేంద్రం

● బీసీల కోసం పాతూరునత్తంలో రూ. 4లక్షలతో అమరనాథరెడ్డి కమ్యూనిటీహాల్ మంజూరు చేయించారు. ఎంతో శ్రద్ధ తీసుకుని కమ్యూనిటీహాల్ నిర్మాణానికి నిధులు మంజూరుచేసిన అమరన్నకు పలువురు బీసీలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. బీసీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని, అమరన్న బీసీల సంక్షేమానికి ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నారని వారు చెబుతున్నారు.





రైతులను నట్టేట ముంచిన వైసీపీ

రైతులకు వైసీపీ ప్రభుత్వం దగా చేసిన విధానాన్ని అన్ని వర్గాలకు వివరిస్తాం. టీడీపీ హయాంలో అందించిన బిందు, తుంపర్ల సేద్యాన్ని, వ్యవసాయ యాంత్రీకరణ, తదితర సంక్షేమ పథకాలు.. వీటిని వైసీపీ తుంగలో తొక్కడాన్ని రైతుల్లోకి తీసుకెళ్తాం. రైతు కుటుంబం నుంచి వచ్చిన వారికే వారి కష్టాలు తెలుస్తాయి. అందుకనే రైతు కుటుంబం నుంచి వచ్చిన అమరన్నను తిరిగి ఎమ్మెల్యేగా ఎన్నుకుని, మళ్ళీ మంత్రిని చేసి రైతులకు ప్రయోజనం కలిగేలా చర్యలు చేపడుతాం. - రామచంద్రనాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్, వి.కోట మండలం



మైనారిటీలంతా టీడీపీవైపే

గతంలో టీడీపీ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. రంజాన్‌తోఫా, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా రుణాలు, పెళ్లికానుక వంటి పథకాలు అందించింది. వీటన్నింటినీ వైసీపీ రద్దు చేసింది. అరాచకపాలన సాగిస్తోంది. వీటన్నింటిపై ముస్లిం మైనారిటీలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. మేమూ వీటిపై ప్రచారం చేస్తూ చంద్రబాబు సీఎం కావడానికి అమరనాథరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించడానికి కృషిచేస్తాం.
- షౌకత్‌అలీ, బైరెడ్డిపల్లె మండల టీడీపీ మైనారిటీ నాయకుడు

అభివృద్ధికి కేరాఫ్ అమరనాథరెడ్డి



రాజకీయ కుటుంబంలో పుట్టిపెరిగిన అమరనాథరెడ్డికి ప్రజలతో సాన్నిహిత్యం బాల్యం నుంచే ఉంది. తండ్రి వేలు పట్టుకుని నడిచిన నాటినుంచే ప్రజల కష్టసుఖాలు తెలుసు. అవే అభివృద్ధి బాటలో ఆయనను నడిపించాయి. పలమనేరు నియోజకవర్గ అభివృద్ధికి అమరనాథరెడ్డిని శాశ్వత చిరునామాగా మార్చేశాయి. నియోజవర్గంలోని పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లి, వి.కోట మండలాలతో పాటు పలమనేరు మున్సిపాలిటీలో ఆయన చేసిన అభివృద్ధిని వీక్షిస్తే ఆయనకు ప్రజాసేవపట్ల ఉన్న అకుంఠిత సంకల్పం ఎంత బలమైనదో అర్థం అవుతుంది.

ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా వ్యూహం



వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేక ఓట్లు చీలకుండా అమరనాథ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించి, తిరిగి మంత్రిని చేస్తాం. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పలమనేరుతోపాటు రాయలసీమ ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధికి బాటలు వేస్తాం. వచ్చే ఎన్నికలో 50 వేల ఓట్ల మెజారిటీతో విజయం మాదే.

- విజయ్, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్, వి.కోట మండలం

వైసీపీ పాలనపై విసిగిన జనం

నియోజకవర్గంలో అక్రమ రవాణా, అక్రమ వ్యాపారాలు, దౌర్జన్యాలు, తప్పుడు కేసుల బనాయింపు ఎక్కువైపోయింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడింది. ఇలాంటి వైసీపీ పాలన పట్ల ప్రజలు విసిగిపోయారు. ఈ సారి ఓటుతో తమ తలరాత మార్చుకోవాలని చూస్తున్నారు.

- నాగరాజు, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు



తండ్రి బాటలో..



అమర్నాథ్‌రెడ్డి తండ్రి రామకృష్ణారెడ్డి మూడు సార్లు పంచాయితీ సర్పంచ్‌గాను, పుంగనూరు సమితి ప్రెసిడెంట్‌గాను, మూడు సార్లు పుంగనూరు ఎమ్మెల్యేగాను, మూడు సార్లు చిత్తూరు పార్లమెంట్ సభ్యులుగా పనిచేశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో కీలకపాత్ర పోషించారు. పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్‌కు, ప్రస్తుత టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబుకు అత్యంత సన్నిహితులుగా వుండేవారు. అమరనాథరెడ్డి తల్లి తాయారమ్మ కూడా రెండు సార్లు పంచాయితీ సర్పంచ్‌గా పనిచేశారు.

ఎన్నో పదవులు : 1981నుంచి 1995 వరకు రెండు సార్లు వరుసగా గ్రామపంచాయితీ సర్పంచ్‌గా పనిచేశారు. 1995-1996 లో డిసీసీబీ ఛైర్మెన్‌గా పనిచేశారు. పుంగనూరు ఎమ్మెల్యేగా 1996-99వరకు, 2004నుంచి 2009 వరకు, పనిచేశారు. నియోజకవర్గాల పునర్విభజనతో సొంత మండలం పలమనేరు నియోజకవర్గానికి చేరడంతో పలమనేరు ఎమ్మెల్యేగా 2009నుంచి 2014, 2014-నుంచి 2019 వరకు పనిచేశారు. ప్రస్తుతం పలమనేరు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్నారు.

టీడీపీ సారథ్యం : పెద్దపంజాణి మండల టీడీపీ యువత అధ్యక్షులుగా 1985నుంచి 1989 వరకు పెద్దపంజాణి మండల టీడీపీ అధ్యక్షుడుగా1989-1997వరకు, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడుగా 2000నుంచి 2005 వరకు పనిచేశారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడుగా 2004 ,2012, 2019 లలో పనిచేశారు. ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగాను, తెలుగుదేశం పార్టీ జోన్-5 (కడప, నంద్యాల, కర్నూల్, అనంతపురం, హిందూపురం) ఇన్‌ఛార్జిగానూ ఉన్నారు.

రైతుల కోసం...

● పలమనేరు నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయ ఆధారిత నియోజకవర్గం. రైతులు విస్తారంగా కూరగాయలను సాగుచేయడం ఇక్కడ ఆనవాయితీ. దీంతో పెరుగుతున్న కూరగాయల సాగును దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతమున్న వ్యవసాయ మార్కెట్ కమిటి రైతులకు కావలసిన మేర సేవలు అందించేందుకు వీలు కావడం లేదని అమరనాథరెడ్డి గుర్తించారు. పట్టణానికి 5 కిలోమీటర్ల దూరంలోని కేటిల్ ఫారం వద్ద జాతీయ రహదారికి పక్కనే 33 ఎకరాల స్థలాన్ని సేకరించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు చేసేందుకు అమరనాథరెడ్డి శంఖుస్థాపన చేశారు.

● మార్కెట్ కమిటి అభివృద్దికి రూ.12 కోట్లు మంజూరు చేయించారు. ఈ మార్కెట్ కు ప్రహరీగోడ నిర్మాణం చేశారు. అంతలోనే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మార్కెట్‌కమిటి నిర్మాణ పనులు ఆగిపోయాయి.

● రైతుల కోసం నాబార్డు నుంచి రూ.89 లక్షలు మంజూరు చేయించి, రైతు శిక్షణా కేంద్రాన్ని, పశుపరిశోధన కేంద్ర భవనాన్ని నిర్మించారు.

● కేటిల్‌ఫారం వద్ద ఉన్న పశుసంవర్థక శాఖ పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం రూ.1.70 కోట్లతో హాస్టల్ భవనాన్ని నిర్మించారు.





పుట్టినతేది: 02-07-1959
చదువు: బీకాం
ఇష్టం :గుర్రపుస్వారీ, షూటింగ్
ఊరు: పెద్దపంజాణి మండలం కెళవాతి
తల్లి: ఎన్. తాయారమ్మ
భార్య: ఎన్.రేణుకారెడ్డి, ఎంఎస్‌సీ గోల్డుమెడలిస్టు
కుమారుడు: ప్రసేన్‌రెడ్డి, ఎంఎస్‌సీ ఏ.ఐ లండన్ యూనివర్సిటీ
కోడలు: ప్రీతికారెడ్డి, యంబీబీఎస్ (పి.జి.కేంబ్రిడ్జి యూనివర్సిటీ)
తమ్ముడు: శ్రీనాథరెడ్డి ఎంబీఏ
చెల్లెలు: అరుణ

అమర్ చేసిన అభివృద్ధికి సాక్ష్యాలు ఇవీ...

ప్రగతి పరుగులు

● మూడు దశాబ్దాల క్రితం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన పలమనేరు మహిళా పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనాలను రూ.8కోట్లుతో నిర్మించారు.

● పలమనేరు ఆర్టీసీ బస్టాండు వద్ద షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి రూ. 1.15 కోట్లు మంజూరు చేయించారు.

● పలమనేరు టెర్రకోట కళాకారులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకొనేందుకు వీలుగా ఒక భవనాన్ని రూ.1.40 కోట్లతో మంజూరు చేయించి నిర్మించారు.

● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రూ.42 లక్షలతో కంపోస్టు యార్డు అభివృద్ధి, ఫెన్సింగ్, గొబ్బిళ్లకోటూరు నుంచి కంపోస్టుయార్డు వరకు రోడ్డునిర్మాణం చేయించారు.

● బాపూజీ పార్కు, గుండుబావి ఉద్యానవనాలను రూ.77 లక్షలతో ఆధునీకరించారు.

● పలమనేరు సమీపంలోని పారిశ్రామిక వాడలో రూ.1.09 కోట్లతో ఒక సబ్‌స్టేషన్ నిర్మింపజేశారు.

● వైఎస్ హయాంలో నిర్మించిన ఇందిరమ్మ కాలనీ వాసులకు కోట్ల రూపాయలు వెచ్చించి సీసీ రోడ్లు నిర్మించారు.

● పలమనేరు సమీపంలో నూతన కోర్టు భవనాల నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం ఈ భవనాల నిర్మాణం తుది దశకు చేరుకొంటోంది.

● రూ.90 లక్షలతో నూతనంగా పలమనేరు తహసిల్దార్ కార్యాలయంకు నూతన భవనం నిర్మించారు.



గంగవరం మండలంలోని వెలుగు మహిళలకు రూ. 30 లక్షల బ్యాంకు లింకేజిని అందజేస్తున్న అమరనాథరెడ్డి

రోడ్లకు మహర్దశ



ఎం.కొత్తూరులో సీసీరోడ్లు

పలమనేరు నియోజకవర్గంలో అధ్వాన్నంగా ఉన్న పలు రహదారులు అమరనాథరెడ్డి పుణ్యమా అని బాగుపడ్డాయి.

● వి.కోట -పేర్ణాంబట్టు అంతర్రాష్ట్ర రహదారి రూ. 144 కోట్లతో పూర్తిచేయించారు.

● ఎంసీబీ రోడ్డునుంచి జగమర్ల ఎస్టీకాలనీ వయా జగమర్ల రోడ్డు రూ.5.39 కోట్లతో పూర్తి చేయించారు.

● ఇక బైరెడ్డిపల్లి మండలం రఘునాయకులదిన్నె నుంచి తిమ్మయ్యగారిపల్లి రోడ్డుకు రూ.45 లక్షలు, కేపీ రోడ్డునుంచి కూటాలవంక రోడ్డుకు రూ.87 లక్షలు, తెట్టునుంచి నామాలవంక రోడ్డుకు రూ.1.15 కోట్లు మంజూరు చేయించారు.

● గంగవరం మండలం - శంకర రాయలపేట రోడ్డునుంచి వీరిశెట్టిపల్లి వయా పశుపత్తూరు రోడ్డుకు రూ.54.60 కోట్లు... ఇలా చెప్పుకొంటూ పోతే నియోజకవర్గంలోని పలు ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ రోడ్డు అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు అమరనాథరెడ్డి మంజూరు చేయించి అభివృద్ధి చేశారు.

పారిశ్రామిక వెలుగులు

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న అమరనాథరెడ్డి పలమనేరు నియోజకవర్గంలోని యువతకు, మహిళలకు, విద్యావంతులకు ఉపాధి కల్పించేందుకు విశేషమైన కృషిచేశారు. పలమనేరు బైపాస్ వద్ద పట్టణంలోని ఆటో కార్మికులందరికి వివిధ రకాల పనులు చేసుకొనేందుకు వీలుగా ఆటోనగర్ మజూరు చేయడంతో పాటు బ్యాంకుల ద్వారా పలువురికి ఆర్థికసాయం అందించారు. ఆటోనగర్ అభివృద్ది కోసం 6కోట్ల మంజూరు చేశారు. ఆటోనగర్‌లో బీటీ రోడ్లు నిర్మించారు. దీంతో నేడు ఆటోనగర్ ఎంతో మంది జీవనానికి భరోసా ఇస్తోంది. ఇక గంగవరం మండలం నాలుగు రోడ్ల వద్ద దశాబ్దం క్రితం 600 ఎకరాల స్థలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అమరనాథరెడ్డి ఎంతో కృషి చేశారు. అప్పట్లో ప్రభుత్వం నుంచి అందజేసిన వివిధ ప్రోత్సాహకాల అండతో పారిశ్రామిక వేత్తలు పలు పరిశ్రమలు ఏర్పాటు చేశారు. దీంతో నేడు ఈ పారిశ్రామిక వాడ వేలాది మందికి ఉపాధి కల్పిస్తోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన గార్మెంట్ పరిశ్రమలు వందలాది మంది యువతీ యువకులకు ఉపాధి ఇస్తోంది.

బీజేపీతో పొత్తుపై బురదచల్లే కుటిలయత్నం



కేంద్రంలో ఎన్‌ఆర్సీ, సీఏఏ బిల్లులకు వైసీపీ మద్దతు తెలిపింది. ఇప్పుడు బీజేపీతో టీడీపీ పొత్తు అనగానే మాపై బురదచల్లే ప్రయత్నాలు చేస్తోంది. మిస్బా ఆత్మహత్యకు జవాబు చెప్పలేని స్థితిలో అధికార పక్షం ఉంది. వీటన్నింటినీ ముస్లిం మైనారిటీలకు వివరిస్తాం. రానున్న ఎన్నికల్లో వైసీపీకి తగినబుద్ధి చెప్పి, అమరనాథరెడ్డికి అండగా నిలుస్తాం.

- రుహుల్లా, టీడీపీ జిల్లా మైనారిటీ సెల్ కార్యదర్శి.

దళిత యువసైన్యం

దళితుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకునే పార్టీ టీడీపీనే. వీటిపై వాడవాడలా తిరిగి ప్రచారం చేసి అమరన్నను గెలిపించుకుంటాం. ఇందుకుగాను అమరన్న దళిత యువసైన్యం పేరుతో ఒక టీంను ఏర్పాటు చేసుకున్నాం. టీడీపీ అధికారంలోకి వస్తే దళితుల సంక్షేమానికి ఏయే పథకాలు అమలు చేయనున్నారో ప్రజలకు వివరిస్తున్నాం.

- చలపతి, బైరెడ్డిపల్లె మండల టీడీపీ ఎస్సీసెల్ నాయకుడు



వందల కోట్ల నిధులు తెచ్చారు.. వైసీపీ వారొచ్చి ఆపేశారు..

అభివృద్ధి, సంక్షేమంలో పలమనేరు మున్సిపాలిటీని రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలని గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పరిశ్రమల మంత్రిగా అమర్నాథ్‌రెడ్డి కృషి చేశారు. ఆయన మంజూరు చేయించిన కోట్లు విలువ చేసే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రద్దు చేసింది. అవి పూర్తయితే పేరు తెలుగుదేశం పార్టీకీ అమరనాథరెడ్డికీ వస్తుందనే భయంతో అభివృద్ధిని అడ్డుకున్నారు.

● పలమనేరులో దశాబ్దాల క్రితం నిర్మించిన వ్యవసాయ శాఖ కార్యాలయం నూతన భవనాలు నిర్మాణానికి, సబ్‌ట్రెజరీ నిర్మాణానికి, బీసీ భవనం నిర్మాణానికి, ఆడిటోరియం నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా, ఈ పనులనింటినీ వైసీపీ ప్రభుత్వం నిలిపి వేసింది.

● బీఎస్‌సీ పథకం కింద మంజూరు చేసిన ఇళ్ళను వైసీపీ ప్రభుత్వం నిలిపి వేసింది.

● పలమనేరు నియోజకవర్గంలో 22 గ్రామ పంచాయితీ భవనాల నిర్మాణం కోసం రూ.3.40 కోట్లు, పలమనేరు, వి.కోటల్లో ఇండోర్‌స్టేడియంల నిర్మాణానికి రూ.4కోట్లు, నియోజకవర్గంలో 3 ఎస్సీ భవనాల నిర్మాణానికి రూ. 75 కోట్లు, మంజూరు చేసినా అవికూడా వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. ● సిమెంట్ రహదారుల నిర్మాణానికి రూ.176 కోట్లు మంజూరు చేసినా నియోజకవర్గంలో ఎక్కడా ఆ పనులు చేపట్టలేదు.

పలమనేరు తాగునీటిని అడ్డుకున్నారు

పలమనేరు పట్టణ దాహార్తి తీర్చేందుకు నిర్మించిన వైఎస్సార్ జలాశయం తగిన మేర నీటిని అందించలేకపోతోందని భావించి ఈ ప్రాజెక్టుకు అనుబంధంగా మండీపేట కోటూరు సమీపంలోని గంగన్న శిరస్సు జలపాతం వద్ద రూ.35 కోట్లుతో ప్రాజెక్టు నిర్మాణానికి అమరనాథరెడ్డి నిధులు మంజూరు చేయించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కావలసిన అనుమతులు తీసుకురావడంతో పాటు, ప్రాజెక్టు నిర్మాణానికి కావలసిన భూమిని కూడా సేకరించారు. అయితే వైసీపీ అధికారంలోకి రాగానే ఈప్రాజెక్టు పనులు కూడా అటకెక్కించారు. దీంతో ప్రస్తుతం పలమనేరు ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది.

మైనారిటీ సంక్షేమాన్నీ మూలనపడేశారు

పలమనేరు పట్టణంలో అదికంగా ఉన్న ముస్లిం సోదరుల సంక్షేమం కోసం అమరనాథరెడ్డి ఎన్నో కార్యక్రమాలను అమలుకు కృషి చేశారు. నియోజకవర్గ కేంద్రంలో ముస్లిం సోదరులకు పెళ్లిళ్ల జరుపుకొనేందుకు ఎద్దుల సంత వీధిలోని ఈద్గా వద్ద షాది మహల్ నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేయడంతో పాటు పలమనేరు దండపల్లి రోడ్డు, జండామఠంలో ఉన్న షాదీమహళ్ల ఆధునీకరణ కోసం రూ.40 లక్షలు అమరనాథరెడ్డి మంజూరు చేశారు. అయితే ఆపనులు కూడా వైసీపీ అధికారంలోకి రాగానే నిలిపి వేసింది.



గానుగ వద్ద రైతుల కష్టాలు తెలుసుకొంటూ...



బైరెడ్డిపల్లె మండలంలో జరిగిన ఏరువాక కార్యక్రమంలో...



పిల్లంగొట్టె ఊదుతూ...



అనంతపురం కియా వద్ద చంద్రబాబు, కంపెనీ ప్రతినిధులతో...



పలమనేరులో మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తూ...



పలమనేరులో విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ...



మైనార్టీల అభివృద్ధికి పెద్దపీట

మైనార్టీల అభివృద్ధికి అమరనాథరెడ్డి కుటుంబం పెద్దపీట వేసింది. మైనార్టీల కోసం షాదీమహల్ నిర్మించారు. మసీదులను, ఖబ్రస్థాన్‌లను అభివృద్ధి చేశారు. సొంత నిధులతో మైనార్టీల వివాహాలు జరిపించి ఆదర్శవంతంగా నిలిచారు. కేంద్రంలో ఎవరితో పొత్తులో ఉన్నా, లేకున్నా మా ప్రాంత అభివృద్ధి మా నాయకుడు అమరనాథరెడ్డి ద్వారా జరిగింది. ఆ కుటుంబానికి ఎప్పటికీ విశ్వాసంగా ఉంటాం.

- ముబారక్‌తాజ్, మాజీ ఎంపీటీసీ,పెద్దపంజాణి

గ్రామీణ రోడ్లకు నిధుల మంజూరు

మండలంలో ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని గ్రామీణ ప్రాంతాల రోడ్లను అభివృద్ధి చేసిన ఘనత అమరనాథరెడ్డికే దక్కుతుంది. చిన్నపాటి చినుకులకే చిత్తడవుతున్న రోడ్లను అభివృద్ధి చేయడానికి ఆయన చేసిన కృషి అభినందనీయం. ప్రభుత్వం మారడంతో ఆయన కల నెరవేరలేదు. ఎంతో కష్టపడి గ్రామీణ రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే వాటిని రద్దు చేసింది. అభివృద్ధిని అడ్డుకున్న ఈ ప్రభుత్వం పోయే రోజులు దగ్గరపడ్డాయి. అమరనాథరెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించుకుంటాం.

- రెడ్డెప్ప, బీపీ నాయకుడు,పెద్దపంజాణి మండలం









పెద్దపంజాణి పిలుస్తోంది

అమర్ హయాంలోనే ఎంతో అభివృద్ధి

అమరనాథరెడ్డి మంత్రిగా ఉన్న రెండేళ్ల సమయంలోనే యుద్ధప్రాతిపదికన పెద్దపంజాణి మండలంలో అభివృద్ధి పనులు చేపట్టారు. ముఖ్యంగా గ్రామీణ రోడ్ల అభివృద్ధికి పెద్దపీట వేశారు. ఇంకొన్ని పనులు మొదలైనా.. వైసీపీ ప్రభుత్వం వచ్చాక రద్దు చేశారు. దీంతో చాలా గ్రామాల్లో అసంపూర్తి రోడ్లు.. భవనాలు కనిపిస్తుంటాయి.

అమర్ హయాంలో బాగుపడిన రోడ్లు

● కల్లుపల్లె- అప్పినపల్లె రోడ్డు నుంచి షికారి పాళ్యం వరకు రూ.87 లక్షలతో తారురోడ్డు నిర్మాణం. రూ.1.9 కోట్లతో రాయలపేట- గౌదమాకులపల్లె రోడ్డు నుంచి వడ్డిపల్లె వరకు తారురోడ్డు వేశారు. రూ.50.40 లక్షలతో పుంగనూరు- శంకర్రాయలపేట రోడ్డు నుంచి చీమనపల్లె వరకు తారురోడ్డు నిర్మాణం జరిగింది. రూ.1.20 కోట్లతో రాయలపేట- గౌదమాకులపల్లె రోడ్డు నుంచి కూరగాయలకొత్తపల్లె వరకూ తారురోడ్డు వేశారు. రూ1.13 కోట్లతో బొంతలవారిపల్లె, తిరుమలకొండయ్యపల్లె గ్రామాలకు తారురోడ్డు నిర్మాణం చేపట్టారు. రూ.20 కోట్లతో కల్లుపల్లె- చౌడేపల్లె రోడ్డు అభివృద్ధి జరిగింది.రూ.25 కోట్లతో శంకర్రాయలపేట రోడ్డును అభివృద్ధి చేశారు. రూ. 62 లక్షలతో నాగిరెడ్డిపల్లెకు తారురోడ్డు నిర్మాణం. రూ.కోటితో చింతలపల్లె, మాదనపల్లెకు తారురోడ్డు నిర్మించారు. రూ1.31 కోట్లతో గుడ్లంవారిపల్లె, ఆకులవారిపల్లెకు తారురోడ్డు నిర్మాణం.మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో 14 గ్రామీణ ప్రాంతాల రోడ్లను తారురోడ్లగా అభివృద్ధి చేయడానికి రూ 6.64 కోట్లు మంజూరు చేయించారు.



పనులు పూర్తయిన కల్లుపల్లె - చౌడేపల్లె రోడ్డు

మరిన్ని అభివృద్ధి- సంక్షేమాలు

- పెనుబలకలలో రూ.1.09 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పూర్తి చేసి ప్రారంభించారు.
- రూ.15 లక్షల ఎంపీ నిధులతో రాయలపేట, ముత్తుకూరు పంచాయతీలకు ట్రాక్టర్లు పంపిణీ చేశారు.
- రూ.2.65 కోట్లతో 30 గ్రామాల్లో అంగన్వాడీ భవనాలను నిర్మించారు.
- రూ.248.40 కోట్లతో వివిధ గ్రామాల్లో సిమెంటు రోడ్లు ఏర్పాటు చేశారు.
- రూ.17 కోట్లతో బీసీ బాలికల రెసిడెన్షియల్ కాలేజీ మంజూరు చేశారు.
- రూ.90 లక్షలతో వీరపల్లె, కోగిలేరు, అప్పినపల్లె, పెద్దారికుంట, ముత్తుకూరు, బొమ్మరాజుపల్లె గ్రామాల్లో పంచాయతీ భవనాలను నిర్మించారు.
- రూ.45 లక్షలతో ముదిరెడ్డిపల్లె, గల్లావారిపల్లె, వీరపల్లె హరిజనవాడల్లో ఓహెచ్ఎస్ఆర్ ద్వారా తాగునీటి ట్యాంకుల నిర్మాణం చేపట్టారు.
- రూ.5 లక్షలతో రాయలపేటలో రైతు శిక్షణ కేంద్ర భవనాన్ని నిర్మించారు.
- రూ.2.56 కోట్లతో 31 పాఠశాలల్లో ప్రహారీల నిర్మాణం, రూ 2.50కోట్లతో మండలంలో వెలుగు భవనాల నిర్మాణం చేపట్టారు.
- 6637 మందికి కొత్తగా పెన్షన్లను మంజూరు చేశారు.
- రూ 2.50 కోట్లతో వివిధ గ్రామాల్లో తాగునీటి అవసరాలను తీర్చారు.
- నీరు-చెట్టు పనులకు రూ.24.94 కోట్లు ఖర్చు చేశారు. రూ.1.9 కోట్లు ఎస్డీఎఫ్ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.



సుద్దగుండ్లపల్లె తారురోడ్డుతో సాకారమైన ఆరు గ్రామాల ప్రజల కల




నేలపల్లెలో పూర్తయిన పశువైద్య కేంద్ర భవనం

వైసీపీ రద్దు చేసిన పనులు



లింగాపురంలో అంగన్వాడీ భవనం ఇలా..

- రాయలపేట- కల్లుపల్లె రోడ్డు నుంచి చీకలదిన్నెపల్లె, మద్దలకుంట రీచ్-1, 2లలో రూ.1.12 కోట్లతో రోడ్ల పనులు ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేశారు.
- అదేవిధంగా రూ.84 లక్షలతో రాచపల్లె, బొమ్మలకుంట తారురోడ్డు పనులు అర్ధంతరంగా ఆపేశారు.
- శంకర్రాయలపేట నుంచి కీలపల్లె వరకు తారురోడ్డు నిర్మాణానికి రూ1.48 కోట్లు మంజూరు చేశారు. ముత్తుకూరు నుంచి లింగాపురం వరకు రూ1.12 కోట్లు మంజూరు చేశారు. ఈ రెండింటినీ వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది.
- బట్టందొడ్డి నుంచి కురప్పల్లెకు తారురోడ్డు నిర్మాణం కోసం రూ.54 లక్షలు, అండిగానిపల్లెకు రూ1.75 కోట్లు మంజూరు చేశారు. వాటిని కూడా వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది.
- ఈఏపీ ద్వారా మండలంలో 28 రోడ్ల అభివృద్ధికి రూ.30.55 కోట్లు మంజూరు చేశారు. వీటిలో కొన్ని పనులు మాత్రం పూర్తవగా మరికొన్ని రద్దు చేశారు.



ముందుకు సాగని మాధవరం రోడ్డు దుస్థితి

ఆగిన పనులన్నీ పూర్తిచేసి చూపిస్తాం



గంగవరం మండలంలో గత ప్రభుత్వంలో మంజూరై అరకొరగా మిగిలి పోయిన పనులన్నీ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. అలాంటి పనులు, రోడ్లు, భవనాలన్నీ కూటమి ప్రభుత్వంలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం. అమరనాథ రెడ్డి నేతృత్వంలో పార్టీని విజయపథంలో నడిపిస్తాం.

- సోమశేఖర్ గౌడ్, గంగవరం మండల టీడీపీ అధ్యక్షుడు

అరాచకాలకు చరమగీతం పాడతాం



గతంలో ఎన్నడూ లేని రాజకీయ సంస్కృతి ప్రస్తుతం మన రాష్ట్రంలో సాగుతోంది. అక్రమాలను ప్రశ్నించినా, నాయకుల తప్పులను ఎత్తిచూపినా, వారిపై పరోక్షంగా దాడులు చేయడం, లేకపోతే వారి ఆర్థిక మూలాలను దెబ్బతీసి కక్ష తీర్చుకోవడమే ధ్యేయంగా పనిచేస్తున్నారు. టీడీపీని అధికారంలోకి తీసుకొచ్చి ఈ అరాచకాలకు చరమగీతం పాడతాం.

- ప్రతాపరెడ్డి, గంగవరం మండల టీడీపీ కార్యదర్శి

కలిసికట్టుగా జనంలోకి



గంగవరం మండలంలో జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులందరం కలసికట్టుగా గ్రామాల్లో పర్యటిస్తాం. ఈ వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తాం. కూటమి అభ్యర్థిగా అమరనాథరెడ్డిని గెలిపించుకుంటాం.

- మురళి, గంగవరం మాజీ సర్పంచ్

గంగవరంపై చెరగని ముద్ర

తన నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలపాలనే అమర్ కార్యదీక్షకు నిదర్శనం ఆయన మంత్రిగా ఉన్న సమయంలో చేసిన పనులు. రహదారుల నుంచి అంగన్‌వాడీ కేంద్రాల వరకు అన్ని విధాలా అభివృద్ధి చేసి ప్రజలకు మేలు చేయాలనే తపన ఆయనలో అణువణువునా ప్రస్ఫుటించింది. పరిశ్రమలు తెప్పించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేసిన మార్గదర్శకుడు మాజీ మంత్రి అమరనాథ రెడ్డి. ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు ఆయన పట్ల చూపించే అభిమానానికి నిదర్శనం గత ప్రభుత్వ హయాంలో ఆయన చేసిన పనులే.



టీటీడీ పరిధిలోకి కీలపట్ల ఆలయం

మండలంలో గత పదేళ్లలో ఏదైనా అభివృద్ధి జరిగిందంటే అది కేవలం మాజీ మంత్రి అమరనాథ రెడ్డి హయాంలోనే అని చెప్పడంలో ఏమాత్రం సందేహంలేదు. ఆయన మంత్రిగా పనిచేసిన హయాంలో తిరుమల స్వామివారి రూపాన్ని పోలివున్న కీలపట్ల కోనేటిరాయస్వామి ఆలయాన్ని టీటీడీ పరిధిలోకి తీసుకొచ్చారు. రథమండపం, కల్యాణోత్సవ మండపం, రథం, ఆర్చిల నిర్మాణ పనులను చేపట్టి, తిరుమలలో జరిగే ప్రతి పూజా కార్యక్రమాలు ఇక్కడ కూడా నిర్వహిస్తూ తిరుమల ప్రసాదాలను ఇక్కడ భక్తులకు అందించి ఘనత చాటుకున్నారు.



500 ఎకరాల్లో ఇండస్ట్రియల్ హబ్

టీడీపీ ప్రభుత్వంలో మంత్రి అయిన వెంటనే రాష్ట్రాభివృద్ధితో పాటు పలమనేరు నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా గంగవరం మండలంలోని గండ్రాజులపల్లె సమీపంలో 500 ఎకరాల్లో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేశారు. ఔత్సాహిక పరిశ్రమల నిర్వాహకులను ప్రోత్సహించి వందల సంఖ్యలో అనుమతులు మంజూరు చేశారు. సుమారు 10వేలమందికి పైగా నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకున్నారు.దీంతో పాటు స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించేలా కంపెనీలతో మాట్లాడి ఒప్పించారు.

వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆగిన అభివృద్ధి



మొండిగోడలతో సరి

పిల్లలందరికీ అంగన్‌వాడీల్లో అన్ని సౌకర్యాలు ఉండాలనే లక్ష్యంతో గంగవరం మండలానికి 13 అంగన్‌వాడీ కేంద్రాలను మంజూరు చేశారు. ప్రస్తుతం ఆ భవనాలను మొండిగోడలకే పరిమితం చేసిన వైసీపీ నాయకుల తీరుపై గ్రామాల్లో ప్రజలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.

రోడ్లూ వదిలేశారిలా..

మండలంలో గ్రామీణ రహదారులను అనుసంధానం చేసి రైతులతో పాటు ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో, ఎంబీటీ రోడ్డు నుంచి ఉయ్యాలమిట్ట వరకు కొత్తిండ్లు మీదుగా రోడ్డు నిర్మాణానికి రూ.84 లక్షలు, దండపల్లె రోడ్డు నుంచి జోగిండ్లు వరకు బీటీ రోడ్డుకు రూ.84 లక్షలు మొత్తం రూ.1.85 కోట్లతో పలు రహదారుల పనులు ప్రారంభించారు. ఉయ్యాలమిట్ట మీదుగా కూర్నిపల్లె వరకు మట్టిపనులు చేస్తుండగా ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడం ఆ తరువాత పనులు చేస్తే గత ప్రభుత్వానికి పేరొస్తుందని వదిలేశారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారు.

ఐదేళ్లుగా అసంపూర్తిగానే..

ఇంకా, కర్ణాటక నుంచి లింకులున్న ఈ ప్రాంత రోడ్లను బాగుచేస్తే వ్యాపార రంగంతో పాటు అన్నివిధాలా అభివృద్ధి చెంది ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ (ఈఏపీ) ద్వారా రూ.28.22 కోట్లతో 30 రోడ్లు మంజూరు చేశారు. వాటిలో అప్పట్లోనే సగానికి పైగా పనులు పూర్తయ్యాయి. ప్రభుత్వం మారిపోవడంతో ప్రస్తుత పాలకుల నిర్లక్ష్య వైఖరి కారణంగా రోడ్లు పనులు ముందుకు సాగక నిధులు మురిగిపోయే పరిస్థితి నెలకొంది.

తట్ట మట్టీ వేయలేదు

నిధులు పుష్కలంగా ఉన్నా ఐదేళ్లలో పనులు చేపట్టకపోవడంతో కీలపల్లె రోడ్డు, మారేడుపల్లె, కల్లుపల్లె నుంచి బూడిదపల్లె రోడ్డు, ఉయ్యాలమిట్ట నుంచి కూర్నిపల్లె రోడ్డు, జంగాలపల్లె కొత్తూరు నుంచి గుండ్లపల్లె వరకు రోడ్డు, మర్రిమాకులపల్లెతో పాటు చాలా రోడ్లు గుంతలమయమై కంకర తేలి పాదచారులు కూడా అడుగేయలేని విధంగా ఉన్నాయి. ప్రజలు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిలిచిపోయిన రోడ్డు పనులు పూర్తిచేస్తే టీడీపీకి పేరొస్తుందని, పనులను టీడీపీ వారు చేయలేదని వైసీపీ నాయకులు ప్రజలను నమ్మించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలా ఏ గ్రామానికి వెళ్ళినా గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులే కనబడుతున్నాయి తప్ప, ఈ ప్రభుత్వంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా సమస్యలు తీరలేదు, అభివృద్ధీ జరగ లేదు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు.. ఈ ఐదేళ్లలో ఎలాంటి పనులూ జరగకపోవడం, సమస్యలు అలాగే ఉండటాన్ని మండల ప్రజలు పోల్చి చూసుకుంటున్నారు. అందుకనే ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో భాగంగా అమరనాథరెడ్డి ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు హారతులతో స్వాగతం పలుకుతున్నారు. గత ప్రభుత్వంలో చేసిన మేలు గుర్తు చేసి, అతను చేసిన అభివృద్ధి పనులు చూపించి, నీవే రావాలన్నా అంటూ ఆకాంక్షిస్తున్నారు.



గత ప్రభుత్వంలో మంజూరైందనే కక్షతో అపేయడంతో, రాళ్లుతేలి ప్రమాదకరంగా వున్న కీలపల్లె రహదారి

ఇప్పుడంతా భూకబ్జాలు, అక్రమాలే



ఈ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు జరగడం లేదు. మండలలో భూకబ్జాలు, ఆక్రమణలు మాత్రం జోరుగా ఉంటున్నాయి.వీటిని అడ్డుకునే వారే లేరు. ప్రశ్నించిన అధికారులపైనే తిరగబడుతున్నారు.వైసీపీ నేతల అక్రమాలను ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారు. మేమూ వీటిని ప్రజల్లోకి తీసుకెళతాం. ఓటు రూపంలో బుద్ధి చెప్పేలా చేస్తాం.

- ప్రసాద్ నాయుడు, గంగవరం మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు

ప్రలోభాలకు మోసపోవద్దు



వైసీపీ నాయకుల భూకబ్జాలు, ఇసుక దోపిడీ, దౌర్జన్యాలు, అక్రమాల గురించి ప్రజలకు వివరిస్తాం. మరోసారి వైసీపీ శ్రేణుల ప్రలోభాలకు, మాయమాటలకు లొంగవద్దని కోరుతూ ప్రచారాన్ని ముమ్మరం చేస్తాం. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తు చేస్తాం. టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తాం. ఇలా అమరన్న గెలుపే ధ్యేయంగా సైనికుల్లా పనిచేస్తాం.

- కిశోర్‌గౌడు, బైరెడ్డిపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు



వైసీపీ అన్యాయాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం

గత టీడీపీ హయాంలో మంత్రి హోదాలో అమరనాథరెడ్డి కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు నియోజకవర్గానికి మంజూరు చేస్తే వాటిని వైసీపీ ప్రభుత్వం అడ్డుకుంది. దీంతో మన ప్రాంతం చాలా వెనుకబడింది. నియోజకవర్గ ప్రజలకు వైసీపీ ప్రభుత్వం చేసిన అన్యాయాలను వివరిస్తాం. ఓటుతో వైసీపీకి తగిన బుద్ధి చెప్పి అమరనాథరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించి తిరిగి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం.

\- రంగనాథ్, వి.కోట మండల టీడీపీ అధ్యక్షుడు

పక్కదోవ పట్టిన సబ్‌ప్లాన్ నిధులు

వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్ ప్లాన్ నిధులను పక్కదోవ పట్టించారు.సబ్సిడీ రుణాలు అందించకుండా మోసం చేశారు. టీడీపీ హయాంలో మైనార్టీలకు ఇస్తున్న ప్రత్యేక పథకాలను రద్దు చేశారు. ఇలాంటి చర్యలతో బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, ఆర్థిక మూలాలను దెబ్బతీశారు. వీటన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లి భారీ మెజారిటీతో అమరనాథ రెడ్డి విజయానికి పాటుపడతాం.

\- రవి, గంగవరం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు



వి.కోట అభివృద్ధికి
అమరే ఎందుకు కావాలంటే...



నాడు ప్రగతి పరుగులు

టీడీపీ హయాంలో అమరనాథరెడ్డి మంత్రిగా ఉన్నపుడు పలమనేరు నియోజకవర్గంలోని వి.కోటలో అభివృద్ధిని పరుగులు పెట్టించారు. రహదారుల ఆధునికీకరణతోపాటు హంద్రీ- నీవా కాల్వ పనులు 90శాతం పూర్తి చేసి, వి.కోట వరకు కృష్ణా జలాలను తీసుకొచ్చారు.

ఆగిన అభివృద్ధి నేడు

వి.కోట మండల పరిధిలో గత టీడీపీ ప్రభుత్వ హయంలో మంజూరు చేసి.. మొదలు పెట్టిన చాలా పనులు వైసీపీ అధికారంలోకి రాగానే అటకెక్కించేశారు.



వి.కోటలో మంత్రి హోదాలో డిగ్రీ కళాశాల బోర్డును ఆవిష్కరిస్తున్న అమరనాథరెడ్డి (ఫైల్ ఫొటో)

- మూడు రాష్ట్రాల కూడలి ప్రాంతమైన వి.కోట మీదుగా రూ.144 కోట్లతో గుంతలమయంగా ఉన్న పేర్నాంబట్ అంతర్రాష్ట్ర రోడ్డును నాలుగు లేన్ల రహదారిగా మార్చి ఆధునికీకరించారు.అదే రోడ్డును తిరువణ్ణామలై నుంచి మంగళూరు జాతీయ రహదారిగా మార్పు చేసి మూడు రాష్ట్రాల మీదుగా వెళ్లే రోడ్డును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.
- చాలాకాలంగా రోడ్డు సదుపాయం లేని గ్రామాలకు ఈఏపీ గ్రాంట్ ద్వారా రహదారులను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా వి.కోట నుంచి కరిపల్లె మీదుగా ఇటుకరాళ్లపల్లెపై కుప్పం రోడ్డు వరకు రహదారిని వేయించారు. కుప్పం రోడ్డు నుంచి కొంగాటం, కృష్ణాపురం నుంచి గోనుమాకులపల్లె గ్రామీణ రహదారి, జంగంగురువేపల్లె రోడ్లకు నూతన శోభ తీసుకొచ్చారు.
- ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా 16 రోడ్లు, ఈఏపీ ద్వారా 26 రోడ్లు మంజూరు చేసి తన ముద్ర వేసుకున్నారు. సుదీర్ఘ కాలంగా విద్యార్థులు ఎదురు చూస్తున్న డిగ్రీ కళాశాలను కేంద్ర నిధులు ఆర్‌యూఎస్‌ఎస్‌ఏ ద్వారా మంజూరు చేయించి, ప్రారంభించారు.
- వి.కోటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉర్దూ మీడియం అందుబాటులోకి తీసుకొచ్చారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా రూ.15 కోట్లతో మైనారిటీ రెసిడెన్షియల్ కాలేజీని మంజూరు చేసి, స్థలం కేటాయించి.. శంకుస్థాపన చేశారు.
- మండల పరిధిలోని 27 పాఠశాలలకు ప్రహరీలను రూ.2.67కోట్లతో నిర్మించారు. ప్రభుత్వ కళాశాలకు కంప్యూటర్లు అందజేశారు.
- మండల పరిధిలో లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి వి.కోట సబ్‌స్టేషన్‌ను 133కేవీ సబ్‌స్టేషన్‌గా మార్పుచేసి, పాముగానిపల్లె వద్ద కొత్త సబ్‌స్టేషన్ అందుబాటులోకి తీసుకొచ్చారు. రైతులకు ఏడుగంటల నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి చేశారు.
- హంద్రీ-నీవా కాల్వ పనులు 90 శాతం పూర్తి చేసి వి.కోట వరకు కృష్ణా జలాలను తీసుకురాగలిగారు.దీంతో తమ పరిధిలో భూగర్భ జలాలు పెరిగాయని రైతాంగం హర్షం వ్యక్తం చేసింది.
- 18 గ్రామ పంచాయతీల్లో రూ.1.8 కోట్లతో వెలుగు భవనాలు నిర్మించారు.
- తాగునీటి సమస్య పరిష్కారానికి బోడిగుట్టపల్లె, ముదిమడుగు, దొమ్మరి మిట్టలకు రూ.45లక్షలతో తాగునీటి ట్యాంకులు మంజూరు చేశారు.
- కె.కొత్తూరు, పడిగలకుప్పం, నక్కనపల్లె, కరిపల్లె, పెసలుదొడ్డి, రాగినముద్రం, చిన్నశ్యామ, నాగిరెడ్డిపల్లె, కుదువగడ్డ, యర్నపల్లె, నడిపేపల్లె, చౌడేపల్లె గ్రామాల్లో అంగన్‌వాడీలకు రూ.1.28 కోట్లతో నూతన భవనాలు మంజూరు చేశారు.



షాదీ మహల్‌కు శంకుస్థాపన చేస్తున్న అమరనాథరెడ్డి, అప్పటి ఎంపీ శివప్రసాద్ (ఫైల్ ఫొటో)



వి.కోటలో అర్ధంతరంగా ఆగిన క్రీడల భవన సముదాయం

- ముఖ్యంగా రూ.5కోట్లతో గెస్తింపల్లె రహదారిలో మొదలు పెట్టిన శీతల గిడ్డంగుల పనులు అర్ధంతరంగా ఆగాయి. వైసీపీ సర్కారు సదరు పనులకు బిల్లులు ఇవ్వకపోవడంతో పిల్లర్ల దశలోనే పనులు ఐదేళ్లుగా ఆగిపోయి కమ్మీలు తుప్పుపట్టాయి.
- రూ.2కోట్లతో నిర్మిస్తున్న క్రీడల భవన సముదాయం పనులూ ఆగిపోయాయి. పిల్లర్లు పూర్తయి పునాదులు వేశాక ఈ ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. దీంతో చేసేది లేక కాంట్రాక్టర్ పనులను ఆపేశారు.
- ముస్లిం, మైనారిటీల కోసం రూ.కోటి నిధులతో మొదలుపెట్టిన షాదీమహల్ నిర్మాణ పనులకు కూడా ప్రభుత్వం మారాక బ్రేక్ పడింది. చేసిన పనులకు తమకు సంబంధం లేదంటూ సంబంధిత కాంట్రాక్టర్‌కు వైసీపీ నేతలు తేల్చి చెప్పడంతో పనులు ఆగిపోయాయి.
- పట్టణ నడిబొడ్డున రూ. కోటి నిధులతో మొదలు పెట్టిన అంబేడ్కర్ భవన్, బీసీ భవన్ పనులూ ఆగాయి.
- వి.కోటకు మంజూరైన డిగ్రీ కళాశాల ఏడాది పాటు ప్రారంభమై ఆపై తరగతులు జరగలేదు. అధికార పార్టీ నేతలకు చెందిన ప్రైవేటు కళాశాలలకు ఎక్కడ దెబ్బ పడుతుందో అన్న కారణంతో ఈ సర్కారు పట్టించుకోలేదని విమర్శలున్నాయి. దీనివల్ల తమ పిల్లలు డిగ్రీ చదువుకోవాలన్న లక్ష్యం నెరవేరలేదని పేద విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- రూ. 15 కోట్లతో మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాల కోసం నిధులు మంజూరై, స్థలం కేటాయించినా ఆ పనులు కార్యరూపం దాల్చలేదు. దీంతో ముస్లిం, మైనారిటీ వర్గాలు వైసీపీ ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పిస్తున్నాయి.
- మంత్రి హోదాలో అమరనాథరెడ్డి తీసుకొచ్చిన అనేక సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుబాటులోకి తెస్తే ఆయనకు పేరు, ప్రఖ్యాతులు వస్తాయన్న కారణంగా వైసీపీ ప్రభుత్వం పనులను అడ్డుకోవడం సరికాదని ప్రజలు విమర్శిస్తున్నారు. అలాగే వి.కోట శరవేగంగా అభివృద్ధి చెందాలంటే అధికార పక్షానికి తగిన బుద్ధి చెప్పాలని టీడీపీ నేతలూ అభిప్రాయపడుతున్నారు.

పునాదులకే పరిమితమైన శీతలగిడ్డంగులు

